నార్ల కదంబం

అనుభవాలు - అభిప్రాయాలు



నార్ల కదంబం

అనుభవాలు - అభిప్రాయాలు

అభిప్రాయాలు, అనుభవాలు

- ❖ ఈనాడు స్ఫురించిన భావం మరొక నాటికి జ్ఞాపకం వుండకపోవచ్చు; జ్ఞాపకం వున్నా తొలి స్ఫురణలోని వాడి తగ్గవచ్చు, విన్నాణం తరగవచ్చు, వైచిత్రి మరుగుపడవచ్చు, విస్ఫూర్తి మందగించవచ్చు. అందువల్ల ఎప్పుడు స్ఫురించిన భావాన్ని అప్పుడే ఒకచోట వ్రాసుకోవడం మేలు. పదేళ్ళ నుంచి పదేపదే అనుకొంటున్నా ఈ పని నాకు పొసగనే లేదు. ఇకనైనా నా పట్టుదలతో సాగించాలి. (ఇది సెప్టెంబర్ 23, 1951 నాడు అనుకొన్నమాట. అయితే ఈ మాటపై నిలిచింది కొన్ని నెలలైనా కాదు.)
- ❖ కొందరు పుస్తకాలు వ్రాస్తారు, చాలామంది వాటిని కూర్చుతారు. పుస్తకాలను "కూర్చడం" అంటే పత్రికలనుంచి, పుస్తకాలనుంచి, లేదా రెండింటినుంచి, తమకు కావలసిన విషయాలను సేకరించి ఒక కొత్త పుస్తకాన్ని కూర్చడం. ఈ పని చేసేవారికి కలంతో అంతగా పని వుండదు; వీరికి ముఖ్యంగా కావలసినవి కత్తెర, జిగురు. వీరు చేసే పనిని గ్రంథ చౌర్యం అనలేము. వీరు ఏదో ఒక గ్రంథం నుంచి కాక, పెక్కింటి నుంచి దొంగిలిస్తారు; అవసరమైనప్పుడు పత్రికలనుంచి కూడా దొంగిలిస్తారు. పైగా, తాము దొంగిలించిన దాన్ని పూర్తిగా కాకపోయినా, కొంతవరకు సొంత మాటలలో పెడతారు.
- ❖ మన విశ్వవిద్యాలయాల నుంచి "డాక్టరేట్" పొందడానికి ఇదే పెక్కుమంది ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతి. మన దౌర్భాగ్యవశాన ఒక పుస్తకం నుంచి దొంగిలించడం గ్రంథ చౌర్యం కాగా, పదింటినుంచి దొంగిలించడం "డాక్టరేట్"ను సంపాదించి పెట్టగల పరిశోధనగా చెల్లుతున్నది.
- ❖ అధికారం బహు చెడ్డది. ఆశలను అది రెచ్చగొడుతుంది, అహంకారానికి ప్రోది చేస్తుంది, అసహనాన్ని ప్రోత్సహిస్తుంది, ఆప్తులతోనే విరోధాలను తెచ్చి పెడుతుంది. అంతర్వీక్షణలేని
- ❖ వ్యక్తిని అతి త్వరలోనే అది కేవల మొక అష్టావక్రుని చేసివేస్తుంది, అధఃపాతాళానికి తొక్కివేస్తుంది.

- ❖ నోటి దురుసుతనాన్నే గడసరితనంగా యెంచుకునేవారు కొందరుంటారు. నోరు పారవేసుకొనకపోతే, పేరుప్రఖ్యాతులు రావని నమ్మేవారు సయితం వుంటారు. అట్టివారిని పలకరించడమే పాపం కుశలప్రశ్నవేసినా, వీరినుంచి వచ్చేది వంకర జవాబే. నొప్పించగల మేరకే తమ మాటకు ఒప్పిదమన్నట్టు వీరు ప్రవర్తిస్తారు. గోష్టికి పిలిస్తే, వీరు తూలనాడనివారుండరు; ఉపన్యాసానికి ఆహ్వానిస్తే వీరు ఉల్లంఘించని సభామర్యాద వుండదు. సందర్భాసందర్భాలను గుర్తించకపోవడమే వీరి ఘనత; ఉచితానుచితాలను పాటించకపోవడమే వీరి ప్రత్యేకత.
- ❖ విజయవాడ కవిసమ్రాట్ కాదన్నా, రేపల్లె కవిసమ్రాట్ లేదన్నా, బౌద్ధ, జైన మతాలు తెలుగుతనానికి ఎన్నెన్నో జిలుగులను కూర్చాయి. దాదాపు ఒక వెయ్యి సంవత్సరాలు మన ప్రాంతంలో పరిఢవిల్లి నందున అవి మన కళలను, మన సారస్వతాన్ని పరిపరివిధాల ప్రభావితం చేశాయి, ప్రకాశమానం చేశాయి, పరిపుష్టం చేశాయి.
- ❖ మన దౌర్భాగ్యవశాన ఈనాడు కవిసమ్రాట్టులుగా చెల్లుతున్న ప్రముఖులిద్దరు ఈ చారిత్రక సత్యాన్ని తిరస్కరించడానికి సాహసించ గలగడం ఆంధ్రప్రదేశ్ లో బౌద్ధ, జైనమతాల చరిత్ర విషయమై జరగదగు విస్తృత పరిశోధనలు జరగనందునే! తమిళులు, కర్నాటకులు ఈ విషయమై విశేషంగా పరిశోధనలు చేశారు, చేస్తున్నారు. ఇంతేకాదు, తమ బౌద్ధ, జైన వారసత్వాలవిషయమై వారు గర్విస్తున్నారు.
- ❖ తమిళనాడుపై, కర్నాట దేశంపై జైన ప్రభావం అధికం కాగా, మనపై బౌద్ధ ప్రభావం హెచ్చు. బర్మాకు బౌద్ధం వెళ్లింది తెలుగుగడ్డనుంచే. బర్మా మననుంచి బౌద్ధంతోపాటు మన తెలుగు లిపిని కూడా స్వీకరించింది. మన కవిసమ్రాట్టులకు తెలియక పోవచ్చుగాని, ఒక బర్మీస్ విద్వాంసుడు తమలిపి, కొన్ని చేర్పులతో, మార్పులతో, తెలుగు లిపి అని నిరూపిస్తూ ఒక గ్రంథాన్ని వ్రాశాడు.
- ❖ అన్ని ఆసియన్ దేశాలకు మన తెలుగు నేలనుంచి బౌద్ధం వెళ్లి వుండకపోవచ్చు. కాని, ఆంధ్రకళ, “అమరావతీరీతి” అనే పేరుతో, ఆసియాఖండం నలుమూలలకు అలుముకున్నది.

❖ ఆ ఒకభాష ప్రతిపత్తి దాన్ని మాట్లాడే వారి సంఖ్య పై కాక, దానిలో వెలువడే సాహిత్యంపై, సాహిత్యం సంపాదించుకొనగల గౌరవంపై ఆధారపడి వుంటుంది. కాబట్టి, స్వభాషా సేవకు మార్గం – దానిలో ఉత్తమోత్తమ సాహిత్యసృష్టికి తపస్సు కాని, సంఖ్యాబలాన్ని చాటుకొనడం కాదు.

❖ "ఆడదానికిది తగునా!" అని ఆడవారిచేతనే అనిపించగలగడం హిందూధర్మ శాస్త్రానికి విజయపతాక.

❖ ఉద్రేకానికి ఆంధ్రునికి పెట్టింది పేరు. అతనికి పర్యాయపదంగా "ఉద్రేకి" అని వాడవచ్చునేమో! ఇంతగా ఉద్రేకి కాబట్టే, అతడు తేలికగా నోరు పారవేసుకుంటాడు; తొందరపడి చేయి చేసుకుంటాడు. ఇట్టే పొంగిన ఉద్రేకం, అట్టే చల్లారినంతనే, తన వేగిరిపాటుకు అతడు – పైకి చెప్పినా, చెప్పకపోయినా – కొంత సిగ్గు, కొంత విచారం పడతాడనుకోండి. ఒక్కొక్కసారి అతడు బాహాటంగానే ఆత్మనింద చేసుకొనడం కూడా కద్దు. ఆంధ్రునిలోని ఆకర్షణకువలె అతడు కలిగించే అసహ్యానికి సయితం కీలకం అతడిలో పెల్లుబికే ఈ ఉద్రేకమే!

❖ నిజానికి ఉద్రేకం గర్హించవలసిన ప్రవృత్తి కాదు. ఉద్రేకంలేనివాడికి రక్తం అతిమందంగా ప్రవహిస్తూ వుంటుంది; అతని హృదయస్పందనలో ఉధృతం తక్కువగా వుంటుంది. ఏ పరిస్థితిలోనూ ఉద్రేకపడనివాడు, ఎందుకూ రోష పడనివాడు, బ్రహ్మర్షి అయినా కావాలి; బండరాయి అయినా కావాలి. ఉద్రేకం లేనినాడు ఏ మహత్తర కార్యం జరగదు, ఏ మహోద్యమం నడవదు. గౌతమ బుద్ధుడు ఉద్రేకి; సోక్రటీస్ ఉద్రేకి; ఏసుక్రీస్తు ఉద్రేకి; గాంధీజీ ఉద్రేకి. హింస, క్రౌర్యం, అజ్ఞానం, మౌఢ్యం, అసహనం, పారతంత్ర్యం మొదలైన వాటిని సహించలేక, ఉద్రేకితులైనారు కాబట్టే వీరు మహాత్ములైనారు, మహాప్రవక్తలైనారు. అయితే వీరి ఉద్రేకం క్షణికమైంది కాదు! స్థిరమైంది. అది వారిని వివశులను చేయలేదు; కర్తవ్యనిష్ఠులను చేసింది.

❖ ఉద్రేకం మానవ జీవితంలో నేమి, మానవచరిత్రలో నేమి ఈవిధంగా ఒక మహత్తరశక్తి అయినప్పటికీ, అది రెండు వైపుల పదునున్న కత్తి. విచక్షణా శక్తిని కోల్పోయిన ఉద్రేకం ఎన్నెన్నో అనర్థాలను కలిగిస్తుంది. న్యాయాన్యాయాలతో,

సమయాసమయాలతో నిమిత్తంలేని ఉద్రేకం మహోపద్రవకరమైంది. దానివల్ల చెరుపు ఇతరులకంటె కూడా తనకే హెచ్చు.

- ‘‘తండ్రీ! నన్ను నా మిత్రులనుంచి కాపాడు’’ అని ప్రార్థించిన ఏసుక్రీస్తువలె,
- “దేవా! నన్ను నా భక్తులనుంచి కాపాడు’’ అని గాంధి కూడా ఎంతగా అనేక పర్యాయాలు ప్రార్థించివుండాలి!
- మన భాషనుగురించి, మన సాహిత్యాన్ని గురించి మనం గొప్ప చెప్పుకొనడమే తప్ప ఇతరులు వీటిని గొప్పచేయడం లేదు సరికదా, మనదేశం సరిహద్దులను దాటి వెళ్ళితే తెలుగు అనే ఒక భాష వున్నదని మనకై మనం తెలియజెప్పుకోవాలి! ప్రాచీన ద్రవిడభాషగా తమిళం పేరు విన్నవారికైనా తెలుగు సంగతి ఏమీ తెలియదు.
- “మన భాషా సాహిత్యాల గొప్పతనాన్ని అన్యులు గుర్తించకపోతే, అది వాళ్ల ఖర్మ’’ అని ఈసడిస్తే మరి చెప్పవలసిందే లేదు. కాని, కేవలం 33 లక్షల మందికే చెందిన నార్వీజియన్ భాషలోని
- నాటకానికి, 70 లక్షల మంది మాత్రమే మాట్లాడే స్వీడిష్ భాషలోని నవలకు ప్రపంచ సాహిత్యంలో ఉన్నతస్థానం వుండగా, ఐదుకోట్ల మందికి మాతృమూర్తియైన ఆంధ్ర సరస్వతి ప్రపంచం మన్ననలను ఎందుకు పొందడం లేదన్న తపన వుంటే మాత్రం ఆంధ్ర సాహిత్యోపాసకులు ఇప్పటి తమ పోకడలను పెక్కింటిని పూర్తిగా మార్చుకోవాలి.
- వేటి రచయితలలో హేమాహేమీల పేరు ప్రతిష్ఠలైనా దాదాపు ఆంధ్రావనికే పరిమితం. అయినా, వారికి పేరు వస్తున్నదని వీరు, వీరికి పేరు వస్తున్నదని వారు లేనిపోని కడుపుబ్బుతో ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకొంటున్నారు. ఇందుకోసం కొందరు పద్యాలు, పాటలు వ్రాయగా, మరికొందరు కథలు, నవలలు ప్రచురిస్తున్నారు. ఇక, ఒకరి పరోక్షంలో మరొకరు కొనసాగించే పరస్పరనిందకు అంతే లేదు. ఇందుమూలంగా మొత్తంగా తామందరు పలచబడుతున్న గుర్తింపు వీరిలో ఒక్కరికైనా లేదు!
- పోతే, ఏవో బిరుదులను తగిలించుకొనడంలో, ఏ విద్యార్థుల సభలలోనో, ఏ గ్రంథాలయాల వార్షికోత్సవాలలోనో సన్మానాలు అందుకొనడంలో వీరిలో వీరికి పోటీ ఇంతంత కాదు. ఇంత చేసినా, తెలుగు యెల్లల వెలుపల తమ పేరు ఏపాటిగా

విన వస్తున్నదని ఒక్కరైనా ప్రశ్నించుకోగలిగితే, ఈ స్వల్ప గౌరవాలకు వీరు ప్రాకులాడ్డం జరగదు. గౌరవ ప్రతిష్ఠలను సముపార్జించుకొనడానికై మన కవులు, రచయితలు కృషి చేయరాదని దీని తాత్పర్యం కాదు. కాని లోకం మెప్పుపొందడానికి మార్గం వట్టి గొప్పలు చెప్పుకొనడమూ కాదు, ఒకరి నొకరు తెగవాడు కొనడమూ కాదు.

❖ మచిలీపట్నం నుంచి మంచిర్యాల వరకు, బరంపురం నుంచి బళ్ళారి వరకు ఎప్పుడెప్పుడు, ఎవ్వరెవ్వరు పరిపాలన కొనసాగించారో చెప్పడానికి చరిత్రకారుడు కావాలి. కాని, ఈ సువిశాల ప్రాంతం చిరకాలంగా ఒకేభాష పరిపాలనకింద వున్నదని చెప్పడానికి మాత్రం ఏ చరిత్రకారుని ఏ సహాయాన్ని అపేక్షించనక్కరలేదు.

❖ బరంపురానికి ఒకూడు ఖారవేల్లుడు ఏలికై వుండవచ్చు. తర్వాత దాన్ని గజపతులు పరిపాలించి వుండవచ్చు. శ్రీకృష్ణదేవరాయని సార్వభౌమత్వాన్ని గుర్తించిన ప్రాంతంలో కొంతకాలమది భాగమైవుండవచ్చు. ఇప్పుడది ఒరిస్సాలోని ఒక పట్టణమై వుండవచ్చు. అయినా, క్రీస్తుశకానికి పూర్వపువాడైన భారవేలుని పరిపాలనకాలం నుంచి, ఇప్పుడు సత్పతి ప్రభుత్వం కాలం వరకు అది సిసలైన తెలుగుగడ్డ. "అమ్మ–అబ్బ–మామ– అత్త– జేజి– దాయె" అంటూనే అక్కడ పుట్టిన బిడ్డ మాటలాడ్డం నేర్చుకొంటుంది. 'రండి– కూర్చోండి" అంటూ అక్కడివారు ఒకరి వొకరు మర్యాద చేసుకొంటారు. "నీతాడు తెంచుతా!" "నిన్ను పాతి పెడతా!" అంటూనే అక్కడివారు ఆగ్రహం కలిగినప్పుడు కయ్యానికి కాలుదువ్వుతారు; అనుగ్రహం కలిగితే "అన్నయ్యా!"అంటూనో, "తమ్ముడూ' అంటూనో ఒకరినొకరు కౌగలించుకొంటారు కూడా.

❖ బరంపురం చరిత్రకు పూర్తిగా భిన్నమైనట్టిది బళ్ళారిచరిత్ర. అయినా, అదీ తెలుగు బస్తీయే. ఇట్టివే మచిలీపట్నం, మంచిర్యాలలు కూడా. నాలుగు దిశలలోనున్న ఈ నాలుగు తెలుగు పట్టణాలకు మధ్యలోగల భూభాగానికి ఆదికవి ఒకే నన్నయ్య; దీనికి మహాకవి ఒకే తిక్కన్న; కవి సార్వభౌముడు ఒకే శ్రీనాథుడు; భక్తకవి ఒకే పోతన; శివకవి ఒకే సోమన; మధురకవి ఒకే పెద్దన; చతురకవి ఒకే రామకృష్ణుడు; ప్రౌఢకవి ఒకే భట్టుమూర్తి; ప్రజాకవి ఒకే వేమన. వీరు వెలిగించిందే

తెలుగింటి కవితాదీపం; వీరు పెట్టిందే తెలుగుజాతికి సాహిత్యభిక్ష. పూర్వం వేర్వేరు రాజుల పరిపాలనలో వున్నా, ప్రస్తుతం వేర్వేరు రాష్ట్రాలలో చెల్లాచెదురై వున్నా, తెలుగువారి నందరినీ అన్నదమ్ములను చేస్తున్నట్టిదీ, వారికి తెలుగుతనాన్ని ఆపాదిస్తున్నట్టిదీ వారి ఏకకవితే, వారి ఏకసాహిత్యమే, వారి ఏకసంస్కృతియే!

❖ అభిమానం – అది దేశాభిమానమైనా, రాష్ట్రాభిమానమైనా, భాషాభిమానమైనా, చివరికి ఆత్మాభిమానమైనా – ఎంత మంచిదో, దురభిమానం అంత చెడ్డది. మానవసంఘాన్ని కలుషితం చేసే విద్వేషాలలో, మాత్సర్యాలలో, సంఘర్షణలలో, సంక్షోభాలలో పెక్కింటికి మూలం దురభిమానాలే.

❖ అభిమాని మాత్రమే అయిన వ్యక్తి "ఎవరి అభిమానాలు వారివి" అని సరిపెట్టుకుంటాడు. దురభిమానికి ఇది సాధ్యం కాదు. అతడు వలచింది మాత్రమే రంభ; అతడు మునిగింది మాత్రమే గంగ. అందువల్ల మరొకరు వలచిన వనితను అతడు తాటకి అంటాడు; మరొకరు మునిగిన గంగను మురుగు కాల్వకింద జమకడతాడు. ఈ అసహనం సహజంగా ఇతరులలో కూడా అసహనాన్నే రెచ్చగొడుతుంది. అక్కడినుంచి పట్టుదలలు పెరిగిపోతాయి; పెరిగి, పెరిగి అది సిగపట్ల వరకు పోయినా పోవచ్చు.

❖ దురభిమానం ఇంత దుష్టమైంది కాబట్టే, దేన్నిగురించి అది వ్యక్తమౌతుందో దానికే అది చేటు తెస్తుంది; ఎవరినుంచి వ్యక్తమౌతుందో వారికే కీడు చేస్తుంది.

❖ "ప్రజాస్వామ్యపక్షాలు ఒక స్థిరనిర్ణయం చేసినతర్వాత కూడా పత్రికలు దానికి విరుద్ధంగా ప్రచారం చేస్తున్నాయి" అని చెప్పి, ఇది పత్రికాధర్మానికి పూర్తిగా విరుద్ధమన్నట్టు ఈ మధ్య కొందరు కాంగ్రెసు నాయకులు మాట్లాడుతున్నారు. రాజకీయ పక్షాలు చేసే నిర్ణయాలు వాటి సభ్యులకు శిరోధార్యాలు కాని, పత్రికలకు మాత్రం కాదు, కారాదు. దేశంలోని రాజకీయ పక్షాలన్నీ చేరి, ఒక నిర్ణయాన్ని చేసినప్పటికీ, అది సముచితమైనది కాదని చిత్తశుద్ధిపూర్వకంగా నమ్మినప్పుడు, దాన్ని ఏకాకిగానైనా నిలిచి ఖండించడమే, ఎన్ని కష్టనష్టాలకైనా సన్నద్ధపడి ప్రతిఘటించడమే, పత్రికల ధర్మం. బహుళ ప్రజాభిప్రాయానికి విరుద్ధంగానైనా సరే, అవసరమైతే నిలబడి, తాము సత్యమని నమ్మిన దానికోసం, న్యాయమని నమ్మినదాని కోసం, ధర్మమని

❖ నమ్మినదాని కోసం పత్రికలు పోరాడాలి. ఇందుకు – సాహసించలేని పత్రికలు చిత్తు కాగితాల పత్రికలే, చిత్తశుద్ధిగల పత్రికలు కావు.

❖ ఆకలికి, అజ్ఞానానికి, ఆర్తికి తావులేని నూతన వ్యవస్థ నిర్మాణం జరగాలన్నా, శాంతి, సుభిక్షాలకు నిలయమైన నూతనసమాజం నెలకొనాలన్నా, అందుకు పూర్వఘట్టంలో సాహిత్య సంస్కృతీ రంగాలలో నవచైతన్యం విధిగా కానరావాలి. ఒక నూతన వ్యవస్థ నిర్మాణానికి, ఒక నవసమాజ సంస్థాపనకు నవోత్సాహం కావాలి, నవవిశ్వాసం కావాలి.

❖ ఇది మన దేశం విషయంలోనే కాక, అన్నిదేశాల విషయంలోను నిజం; ఇది మన కాలంలోనే కాక, అన్ని కాలాలలోను నిజం. యూరోపియన్ దేశాలు మధ్యయుగం నుంచి ఆధునికయుగంలో అడుగుపెట్టడానికి ముందు సాహిత్యలోకంలో, కళాజగత్తులో, సంస్కృతీ ప్రపంచంలో నవవికాసం కానవచ్చింది. డాన్స్, లియొనార్డ్. దవించీలు ఆవిర్భవించిన పిమ్మటనే ఇటలీ పునర్వికాసాన్ని పొందింది. మార్లో, షేక్స్ పియర్లు తలయెత్తిన పిమ్మటనే బ్రిటన్ ఒక ప్రపంచ రాజ్యమైంది. గొథె, షిల్లర్ పరిఢవిల్లిన పిమ్మటనే జర్మనీ ఒక మహారాజ్యమైంది.

❖ ఈనాడు మనం కూడా ఒక నూతన వ్యవస్థను లక్షిస్తున్నాము. అయినా అందుకు కావలసిన శక్తి విశ్వాసాలను మనకు కూర్చగల మహాకవులు, వాగ్గేయకారులు, కళాకోవిదులు ముందుకు రారేమి? పాడగోరుతున్న మన కవుల గొంతులో వెలితి కనిపించడం ఎందువల్ల? వీణాతంత్రులను సవరిస్తున్న మన గాయకుల వ్రేళ్ళు వణకడం ఎందువల్ల? నవప్రభాతాన్ని చిత్రించవలసిన మన చిత్రకారులు తమ కుంచెలను అరుణ వర్ణంలో కాక, కారు నలుపులోనే ఎక్కువగా ముంచడం ఎందువల్ల?

❖ పంచకావ్యాలు చదువుకొన్నవాడు వెనకటి కాలానికి పండిత ప్రకాండుడు. పంచదశ గ్రంథాలు వడ పోసినవాడైనా ఈ కాలానికి పామరతుల్యుడు.

❖ నాలుగు రంగాలలో రెండవవాడు కావడంకంటె ఒక్కదానిలో మొదటివాడు కావడం మంచిది.

❖ వాన ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో – వాతావరణ శాస్త్రజ్ఞులకు కోపం వచ్చినా సరేగాని – చెప్పడం బహుకష్టం. "వాన రాకడ, ప్రాణం పోకడ తెలియదు"

అని చెప్పిన మన పెద్దలు పిచ్చివారు కారు. వరుణదేవుని బుద్ధి ఎంత చంచలమైందో శతాబ్దాల – కాదు, సహస్రాబ్దాల – స్వానుభవం వల్ల తెలుసుకున్నవాడు కాబట్టే, మన కర్షకుడు "చిత్త చిత్తగించి, విశాఖ విసరకుండా, ఉత్తర ఉరమకుండా, హస్త అనుగ్రహించి, స్వాతి చల్లగా చూస్తే, అనురాధలో అడిగినంత పంట" అని చెప్పాడు. వానదేవుడు తిన్నగా చూడకపోతే, తన ప్రయోజకత్వం ఏమీ లేదని వరసగా ఎన్ని షరతులను అతడు పెట్టాడో చూడండి.

- నవ్యాంధ్రకవి శ్రీ రాయప్రోలు సుబ్బారావు పలుకులలో తిరిగి మనకు "వచ్చింది, వచ్చింది, పచ్చ సంక్రాంతి! వచ్చింది, వచ్చింది లచ్చి సంక్రాంతి!!"
- ఊకబంతి, పోకబంతి, రేకబంతి, ముద్దబంతి – ఇలాగే మరెన్నో రకాల బంతిపూల పసిడి కాంతులను విరజిమ్ముకుంటూ "పచ్చ సంక్రాంతి" వచ్చింది; సీమసీమ, ఊరూరు, వాడవాడ కొత్త పంటలతో తొలుకాడుతుండగా "లచ్చి సంక్రాంతి" వచ్చింది.
- ఆ ఇంత వైభవంతో వచ్చిన ఈ సంక్రాంతి లక్ష్మికి స్వాగతంగానే మన వాకిళ్లలో ముగ్గులు, ఆ ముగ్గల మధ్య గొబ్బెమ్మలు. ఆమెకు ఆహ్వానంగానే మన మండిగాలకు పసుపుకుంకాలు, వాటికి మరింత శోభకోసం బంతిపూదండలు, ఆమె పేరుతో బొమ్మల కొలువులు, ఆ కొలువులకు చుట్టపక్కాలకు పిలుపులు.
- "సంక్రాంతి" అనే పేరుతో పిలవకపోయినా, ప్రతిదేశం, ప్రతి జాతి చేసుకొంటున్నట్టిదే ఈ పండుగ. దున్ని, విత్తి, పైరు చేయడాన్ని మానవుడు ఏనాడు నేర్చుకొన్నాడో, తన కష్టాన్ని మెచ్చి భూదేవి పంటరూపంలో తనకు బంగరు వరాలిస్తుందని ఏనాడు తెలుసుకొన్నాడో ఆనాడే దేశదేశాలలో ఈ పండుగ ఏ పేరుతోనో ఒక పేరుతో పుట్టింది. కోత కోసి, కుప్పవేసి, కళ్ళం చేసి, పంట నూర్చి, గింజలను యింటికి తెచ్చుకొనడం జరిగినంత కాలం ఈ పండుగ జరుగుతూనే వుంటుంది.
- ఏదో దురాశ మనస్సును పీడించనిదే, ఏ దురహంకారమో దౌష్ట్యానికి పురికొల్పనిదే మానవుడు యుద్ధానికీ, రక్తపాతానికి సన్నద్ధుడు కాడు. అయితే ఈనాడు దురాశ, దురహంకారాల కంటె కూడా భయసందేహాలే యుద్ధానికి ప్రబల కారణాలౌతున్నాయి. ఒక రాజ్యం ఉద్దేశాలను గురించి మరొకదానికి సందేహం,

ఒకదాని సైనికపాటవాభివృద్ధిని గురించి మరొకదానికి భయం ఇవి ప్రస్తుతం దాదాపు పీడ కలలుగా పరిణమించాయనడంలో అత్యుక్తి లేదు. అందువల్లనే సైనికసంధులు జరుగుతున్నాయి. రాజ్యకూటాల నిర్మాణం కొనసాగుతున్నది, ప్రపంచశాంతి దినదినగండంలో పడుతున్నది.

❖ రక్తపాతంతో కూడిన విప్లవాన్నే కాక, శాంతియుతమైనదాన్ని కొనసాగించ వలెనన్నా ఆత్మవిశ్వాసం కావాలి, వజ్రసంకల్పం కావాలి, ధైర్యసాహసాలు కావాలి, త్యాగనిరతి కావాలి, వీటి నన్నింటిని మించి, విప్లవలక్ష్యాలపట్ల భక్తి శ్రద్ధలు కావాలి. ఇవి లోపించినవారికి విప్లవ మనగానే అన్నీ అనుమానాలే కలుగుతుంటాయి, అన్నీ భయాలే తోస్తూవుంటాయి. ఇట్టివారికి క్రొత్తకు అర్రులు జాచడమే అనుమానానికి మూలం, పాతదారిని తప్పడమే భయానికి కారణం. కాని, కొత్తకోసం తపనతో, కొత్త దారివెంట, ఒక సవాలును ఎదుర్కొంటున్న ధోరణిలో, సాహసోపేతంగా తోసుకుపోకుండా, ఏ విప్లవంలోను విజయాన్ని సాధించలేము.

❖ జీవన్మరణాలు ద్వంద్వాలైనా స్థూలదృష్టికి గోచరించే పరస్పర వైరుధ్యం వాటిలో లేదు. కనుకనే కొందరు సజీవులై వుండి కూడా చచ్చినవారితో సమానం; మరి కొందరు మృతిచెంది కూడా అమరులు. మొదటివారు జీవచ్ఛవాలైతే, రెండవవారు మృత్యుంజయులు.

❖ ప్రేమ పొంగులు తగ్గడంకంటె మిన్నగా సంస్కృతులు కొన్నించడమే మతాంతర, వర్ణాంతర, శాఖాంతర వివాహాలు భగ్నం కావడానికి కారణం.

❖ మన పూర్వవైభవాన్ని కీర్తిస్తూ, ఆధునికయుగాన్ని, దీనిలో రూపొందిన వైజ్ఞానిక శాస్త్రాలను, ఆ శాస్త్రాల ద్వారా సాధించబడిన పురోభివృద్ధిని నిరసించేవారు. ఒకనాడు మనదేశం మహోచ్ఛస్థితిలో వుండడానికి వైజ్ఞానిక, పారిశ్రామిక రంగాలలో దాని ప్రముఖస్థానమే ప్రధాన కారణమన్న సంగతిని మరచిపోతూ వుంటారు. కణాదుడు, సిద్ధనాగార్జునుడు, ఆర్యభట్టు, బ్రహ్మగుప్తుడు, భాస్కరాచార్యుడు, వాచస్పతి, ఉద్యోతకరుడు, ఉదయనుడు, జయంతుడు, శబరస్వామి, విజ్ఞానభిక్షు, భోజుడు, వరాహమిహిరుడు, చరకుడు – ఇట్టి వైజ్ఞానిక శాస్త్రవేత్తలు ఒకనాడు మనకు ఎందరో వుండేవారు. గణిత, రసాయనిక, పదార్థవిజ్ఞాన, ఖగోళ, వైద్యాది అశేషశాస్త్రాలలో ఈ మహామహులు సంపాదించిన

విజయాలే మన దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చాయిగాని, ఋత్విజులు కారు, వారి ఋక్కులూ కావు.

❖ ఏ యుగంలోనైనా, ఏ శతాబ్దంలోనైనా, తుదకు ఏ సంవత్సరంలోనైనా మంచిచెడ్డలు, వృక్షయాలు మిశ్రమంగానే వుంటాయి. ఈ ద్వంద్వాలలో ఒకప్పుడు ఒకటి రెండవదానికంటె ఒకపాలు ఎక్కువ కావచ్చు; లేక తక్కువ కావచ్చు. అంతే తప్ప, సమస్తం మంచికాని, కేవలం చెరుపుకాని, పూర్తిగా అభివృద్ధికాని, పూర్తి క్షయంకాని ఎన్నడూ వుండదు.

❖ ఛత్రాన్ని కలిగివున్నంత మాత్రాన ప్రతివ్యక్తీ ఛత్రపతి కానట్టు, పార్లమెంటును కలిగివున్నంత మాత్రాన ప్రతి ప్రభుత్వ వ్యవస్థ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కాబోదు. ప్రజాకంటకంగా పరిణమించిన ప్రభుత్వాన్ని తూటా ద్వారా కాక, వోటు ద్వారా కూలద్రోయడానికి అవకాశ మిచ్చేదే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. ఈ వ్యవస్థలో పూర్తిగా వాక్స్వాతంత్ర్యం వుండాలి; సభా స్వాతంత్ర్యం వుండాలి; పత్రికా స్వాతంత్ర్యం వుండాలి; ప్రభుత్వ పక్షానికి వ్యతిరేకంగా ఎవరైనా సరే వేరొక పక్షాన్ని స్థాపించడానికి, నిర్వహించడానికి వీలుండాలి. ఇవేమీ లేకుండా పేరుకు ఒక పార్లమెంటు వున్నంతమాత్రాన అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కాబోదు.

❖ సామాన్య ప్రజాహృదయాన్ని ప్రతిబింబింపజేసే తుమ్మెద పదాలు, పర్వత పదాలు, కోత పదాలు, శంకర పదాలు, నివాళి పదాలు, ఆనంద పదాలు, గొబ్బి పదాలు, వాలేసు పదాలు, వెన్నెల పదాలు, రోకటి పాటలు, పెండ్లి పాటలు, భజన పాటలు, లాలి పాటలు మొదలైన జానపద వాఙ్మయాన్ని సేకరించడం మన సంగీత, సాహిత్యకళలకు రెండింటికీ ప్రయోజనకరం. ఇంతేకాదు, మన పూర్వసంస్కృతిని తెలుసుకొనడానికి ఈ కృషి తోడ్పడుతుంది.

❖ సాహిత్యం, సంగీతం, లలితకళలు మొదలైన వాటికి ప్రజా జీవితంతో సన్నిహిత సంబంధం వున్నది. ప్రజల ఆశానిరాశలు, వారి ఆనందనిర్వేదాలు, వారి ఇష్టానిష్టాలు, వారి కష్టసుఖాలు, వారి స్వప్నాలు, స్వప్నభంగాలు : వీటినన్నింటినీ వ్యక్తీకరించి, జీవితానికి ఒక రూప మివ్వగలిగినవి, ఒక గమ్యాన్ని నిర్దేశించగలిగినవి, ఒక అర్ధాన్ని కల్పించగలిగినవి, ఒక సార్ధక్యాన్ని

సమకూర్చగలిగినవి వారి సంగీత, సాహిత్యాది కళలే. అట్టి కళల పోషణకు, వాటి వికాసానికి దోహదం కూర్చలేని ప్రభుత్వం "ప్రజా ప్రభుత్వం' అనే పేరుకైనా తగదు.

❖ సింహద్వారం ఉత్తరవైపునే వుండాలని, పడమటి దిశలో తగదని వాస్తు శాస్త్రజ్ఞుడు చెబితే, అది ఉత్తరపు దిశపై ప్రేమవల్ల కాదు, పశ్చిమంపై విద్వేషం వల్లనూ కాదు. "వరి అన్నం నీకు సరిపడదు; గోధుమ రొట్టెనే నీవు తినాలి" అని డాక్టర్ సలహా చెబితే, గోధుమ చుట్టం, వరి పగ అయినందువల్ల కాదు. "ఈ దిక్కులో వెళ్లిన పక్షంలో నీ నౌక తుఫానులో చిక్కుకోగలదు సుమీ!" అని హెచ్చరించే వాతావరణ శాస్త్రజ్ఞునికి దురుద్దేశాన్ని అంటగట్టడమైనా భావ్యం కాబోదు. అయినా, "ఈ విధానం అరిష్టదాయకం" అని చెప్పే పత్రికకు రాజకీయవేత్తలు దురుద్దేశాలను అంటగట్టడం జరుగుతున్నది.

❖ సంతృప్తి లేని జీవితానికి శాంతి లేదు; అసంతృప్తి లేని జీవితానికి వృద్ధిలేదు.

❖ కాలానికి నిజానికి వేళలంటూ లేవు. దానికి ఆది లేదు, అంతమూ లేదు. ఆద్యంత రహితమైన అనంత ప్రవాహంవంటిది కాలం. నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు; ఇవన్నీ కాల ప్రవాహంపై లేచి, తిరిగి దానిలోనే కలిసిపోయే చిన్న, పెద్ద కెరటాలు. వీటిపై కొంత దూరం పయనించి, వీటితోపాటు తిరిగి కాలగర్భంలో కలసిపోయేవాడే మానవుడు. కనుకనే అతడి దృష్టి సహజంగా ఆ కెరటాలపైనే. గడియారాలతో వాటిని కొలవడానికి అతడు ప్రయత్నిస్తాడు; పంచాంగాలతో వాటి నడక తీరులను నిర్ణయించడానికి అతడు తహతహలాడతాడు; శకాలని, యుగాలని వాటి వర్గీకరణకు అతడు ప్రయత్నిస్తాడు. దీన్ని శుష్కయత్నంగా వేదాంతులు నిరసించ వచ్చు; వృధాశ్రమగా తత్వజ్ఞులు నిందించవచ్చు. కాని, జీవితమాధుర్యం దీనిలోనే వున్నది; జీవితసాఫల్యమూ దీనిలోనే వున్నది.

❖ ఏ ప్రవాహం నుంచి పుట్టిందో, దానిలోనే తిరిగి కెరటం కలసిపోవచ్చు. కాని, పుట్టడానికి, గిట్టడానికి మధ్య అది ఎన్ని వంపులు తిరుగుతుంది; ఎంతగా వయ్యారాలు పోతుంది; ఎన్ని పరవళ్ళు తొక్కుతుంది; ఎన్ని నురుగులు క్రక్కుతుంది; ఎంత సహజంగా, ఎంత సుందరంగా ప్రతి నురుగు బుడగలోను అనంతాకాశాన్ని ప్రతిఫలింపజేస్తుంది; ఎంత మనోహరంగా అనంతకోటి

ఇంద్రధనస్సులను తనలో యిముడ్చుకుంటుంది! కాల ప్రవాహగర్భం పై లేచి, తుళ్ళింతలాడి, అంతలో తెళ్ళే కెరటాలను ఆశ్రయించివుండే మానవ జీవితం విషయంలో ఈ పలుకులు మరెంతగానో నిజం!!

- ❖ ఏమైనా, జీవితాన్ని రోసినవారికి ఉగాది తక్కిన రోజులతోపాటు మరొక రోజు మాత్రమే కావచ్చు గాని, బ్రతుకును ఒక మహావరప్రసాదంగా భావించేవారికి మాత్రం ఉగాది కెంతో వైశిష్ట్యం వున్నది. అది మోడు మొక్కలనే కాక, వాడి వత్తలైన గుండెలను సయితం చిగురింపజేస్తూ వస్తుంది. కొత్త పూబిందెలతో పాటు కొత్త ఆశలను, ఆనందాన్ని వెంటబెట్టుకు వస్తుంది. తియ్య మామిళ్లతో పాటు తేనె పాటలు అందిస్తూ వస్తుంది. నిరుటి ఆశాభంగాలను, నిరుటి ఆవేదనలను తుడిచివేస్తూ వస్తుంది. కొత్త జీవితానికి ఆహ్వానాన్ని చేబట్టుకు వస్తుంది. ఇందువల్లనే అన్ని పండుగలలో ఉగాది మొదటిది మాత్రమే కాదు; అన్నిటికంటె గొప్పది కూడా!
- ❖ అడ్డుగా నిలిచిన కొండగుండా దారి చేసుకొనడం ఎంత కష్టమైనా, ఒకసారి ఏ కాస్త సందునో చేసుకోగలిగిన మీదట మహానదిని ఆపడం ఎవరి తరం? మొదటి నాటి ఊల, రెండవనాటికే బోదె అవుతుంది! మూడవనాటికి అదే కాల్వ, నాల్గవనాటికి అదే వాగు, ఆ పైనాటికి నిండు రూపంతో తొణుకు బెణుకులు లేకుండా సాగిపోయే మహాప్రవాహం. మహాపురుషుల జీవితాలు సయిత మింతే!
- ❖ వర్గకలహ మొక్కటే స్వర్గమార్గం కాదు; మార్క్స్ మాత్రమే మార్గదర్శి కాదు; రక్తపాతంలో ప్రగతి లేదు. వివిధ రూపాలలో విప్లవం సాగవచ్చు; విభిన్న మార్గాల వెంట పురోగతిని సాధించవచ్చు. మార్క్స్ సిద్ధాంతాలనే ప్రాతిపదికగా చేసుకొన్నప్పటికీ రష్యా, చైనాలలోని విప్లవాలు ఒకదాని కొకటి నకలు కాలేదుగదా?
- ❖ మార్క్స్ పంథాలోని శాస్త్రీయ సోషలిజమైనా, మరొక సోషలిజమైనా, దాని లక్ష్య మొక్కటే. అది – ఆర్థికస్వాతంత్ర్యం ద్వారా సాంఘికన్యాయసాధన.
- ❖ ఎరిక్ ఇలియట్ కంపెనీ (లండన్) ఆడిన "ఒథెల్లో" నాటకాన్ని రాత్రి చూశాను. "పేరు గొప్ప, ఊరు దిబ్బగా" వున్నది. నా వరసలోనే కూర్చున్న ఒక తాతయ్య చూచి "వీళ్లు నిజంగా దొరలేనా!" అన్నాడు. (1951)

❖ ఆంధ్రుల లోపం వారు ఆవేశపరులు కావడం కాదు; అది మరొకటి. ఆవేశంతో ప్రారంభించి, వారు ఆలోచనలో పడతారు; లేదా ఆలోచనతో ప్రారంభించి, ఆవేశానికి లోనౌతారు. ఆవేశానికి, ఆలోచనకు పొద్దెదురు కాబట్టే, అన్నిట ఆంధ్రులకు పొద్దెదురు.

❖ ఆటవికులకు, జానపదులకు జాగరికత లేకపోయినా, సంస్కృతిలో అధునాతన నాగరికులకంటె కూడా వారే మిన్నలు కావడం కద్దు.

❖ మనదేశంలో మేధావులున్నారా? అట్టివా రుంటే వారి సంఖ్య అతిస్వల్పం కాదా?

❖ "మేధ"కు మన నిఘంటువులు చెబుతున్న రెండు అర్థాలలో మొదటిది "ధారణా శక్తిగల బుద్ధి", రెండవది "యజ్ఞము". కాని, ధారణా శక్తి గలవాడు, ఆ శక్తి ఎంత ఘనంగా అతడిలో వున్నా, నా దృష్టిలో మేధావి కాడు. పోతే, యజ్ఞం చేసేవాడు మేధావి అసలే కాడు.

❖ ఆవేశరహితంగా ఆలోచించగలవాడే మేధావి; విశ్వాసానికి కాక, తర్కానికి ప్రాధాన్య మిచ్చేవాడే మేధావి; సత్యాన్వేషణమే ఏకైక మతంగా గలవాడే మేధావి; అలౌకికశక్తుల పై, అభూతసంఘటనలపై ఎంతమాత్రం విశ్వాసం లేనివాడే మేధావి; ఒకమాటలో, ఏది తర్కానికి భిన్నమైనదో, ఏది హేతువాదానికి విరుద్ధమైనదో, దాన్ని తిరస్కరించగలవాడే మేధావి.

❖ ఇట్టివారు మన దేశంలో ఎందరున్నారు? మన దేశంలో అక్షరాస్యత ప్రబలుతున్నా, విద్య ప్రబలడం లేదు. విద్యావంతులుగా పేర్కొనదగు కొద్దిమందిలో తిరిగి మేధావుల సంఖ్య మరింత తక్కువ.

❖ మేధకు "ధారణా శక్తి గల బుద్ధి" అని మన నిఘంటువులు అర్థం చెప్పడం అకారణంగా జరగలేదు. మన సంప్రదాయంలో (ముఖ్యంగా హిందూసంప్రదాయంలో) ఆలోచనాపాటవానికి కాక, జ్ఞాపకశక్తికి అధిక ప్రాధ్యాన్య మిచ్చారు. రెండు వేదాలను కంఠస్థం చేసినవాడు ద్వివేది; మూడింటిని కంఠస్థం చేసినవాడు త్రివేది; నాల్గింటిని కంఠస్థం చేసినవాడు చతుర్వేది. వాటి అర్థం అతడికి తెలియకపోవచ్చు; "టేప్ రికార్డింగ్ మెషిన్'కు, అతడికి నిజానికి ఏమీ భేదం లేకపోవచ్చు. అయినా, అతడికే గౌరవం, అతడికే మన్నన.

- ❖ కాగా, వేదాల అపౌరుషేయత్వాన్ని ప్రశ్నించడానికి ఎవడైనా సాహసిస్తే, అతడు పాషండుడు; సంఘం నుంచి వెలివేయదగినవాడు.
- ❖ ఆలోచనా పాటవానికి కాక, ధారణాశక్తి కి ఇంతగా మనం అనేక శతాబ్దాలుగా ప్రాధాన్యమిస్తున్నందున ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలలో పట్టభద్రులైన వారిలో సయితం ఆలోచన దాదాపు పూజ్యం; మౌలికమైన ఆలోచన, సాహసోపేతమైన ఆలోచన మొదలే సున్న.
- ❖ ఈనాడు మన దేశంలో "ఫిలాసఫీ" పేర, మౌలికచింతనకు మారుగా, మూఢ విశ్వాసాలను పెంచుతున్నవారు ఎందరు లేరు? ఈనాడు మన దేశంలో "సైన్సు" పేర, నూతన సత్యాలను కనుగొనడానికి మారుగా, పాత అబద్ధాలను ప్రోదిచేస్తున్నవారు ఎందరు లేరు? ఈనాడు మన దేశంలో "మోడర్న్ ఎడ్యుకేషన్" పేర, జ్ఞానాన్ని కాక, భక్తిని వ్యాపింప జేస్తున్నవారు ఎందరు లేరు?
- ❖ నిజమైన మేధావులు మనకు చెదురుగా తప్ప లేనందునే, మనకు ఊరు కొక "యోగి", నాడు కొక "బాబా" ఈనాడు వెలుస్తున్నారు; వారి పాదసేవకు, పేరుకు "ఉన్నతవిద్య" అభ్యసించిన వారితోపాటు, ఉన్నతోన్నతమైన పదవులలో వున్నవారు కూడా ఎగబడుతున్నారు!!
- ❖ మేధావుల దారిద్ర్యం మనకు ఇంత విశేషంగా కలదు కనుకనే ఒక జాతిగా మసకు ఆలోచన తక్కువ, ఆవేశం హెచ్చు; ఇందువల్లనే మనకు వివేకం తక్కువ, విశ్వాసం హెచ్చు; ఇందువల్లనే మనకు జ్ఞానం తక్కువ, భక్తి హెచ్చు. ఇందువల్లనే మనం వ్యక్తుల కిచ్చే ప్రాధాన్యాన్ని భావాల కివ్వము; ఇందువల్లనే నినాదాలకు మనం తరచు మోసపోతూ వుంటాము.
- ❖ "సంస్కృతం" అంటే "పక్వము చేయబడినది" అని నిఘంటుకారుడు వ్రాస్తున్నాడు. విద్యాబుద్ధులు పక్వం కాగా ఏర్పడేది సంస్కృతి.
- ❖ మేడిపండు మిసిమిసి పోలింది హృదయాన్ని అంటక, హావభావ విలాసాలకు పరిమితమైన సంస్కృతి.
- ❖ లోకంలో నీ స్థానాన్ని తెలిపేవి లోకులు నీ యెదట చెప్పే మాటలు కావు; నీ చాటున చెప్పుకునే మాటలు.

❖ దేకార్త్, గెలిలియో, బేకన్ ప్రభృతుల యుగానికి పూర్వం ఆసియా నుంచి యూరప్ అంతగా భిన్నమైనది కాదు. ఇక్కడవలె అక్కడ కూడా ఏదో ఒక విస్సన్న చెప్పిందే వేదం. ఇక్కడవలె అక్కడ కూడా స్వతంత్రాలోచన శూన్యం, స్వేచ్ఛావర్తన పూజ్యం. బ్రతుకంటే పాత గాడుల వెంట గ్రుడ్డినడక మాత్రమే.

❖ పూర్వాచారాలు, పూర్వసంప్రదాయాలు – ఇవే ఆ పాతగాడులు. కులాని కొక గాడి, లేదా వర్గానికొక గాడి. ఏ కులంలో పుట్టినవారు ఆ గాడివెంట నడవవలసిందే, గాడి తప్పి ఒక్క అడుగు ఇటు పడినా, అటు పడినా, అది కులత ప్పే, లేదా వర్గద్రోహమే. గాడి తప్పిన వానిని రచ్చ కీడ్చేవారు, విచారణ జరిపేవారు, దోషిగా నిర్ణయించేవారు, శిక్ష విధించేవారు.

❖ సంఘబహిష్కరణ, కారాగారవాసం మొదలైన శిక్షలతో సంతృప్తి చెందేవారు కాదు కూడా. చేతులు, కాళ్లు తెగగొడుతుండేవారు; చెవులలో కాచిన సీసం పోస్తుండేవారు; గానుగలో పెట్టి త్రిప్పుతుండేవారు; తలక్రిందులుగా వ్రేళ్ళాడదీసి అడుగునుంచి మంట పెడుతుండేవారు; సింహాలకు, పులులకు మేతగా పారవేసే వారు; ఏనుగులతో తొక్కించేవారు; గొయ్యి తీసి పాతి పెట్టించేవారు; కొరత వేసే వారు; మరెన్ని విధాలుగానో హింసించేవారు.

❖ ఈ ఘోరాతిఘోర పరిస్థితులలో కొత్త భావాలు పొడసూపడ మేమి, కొత్త మార్గాలను మెట్టడ మేమి సర్వసాధారణంగా జరిగేది కాదు; జరిగినా, క్షణికంగానే. చెదురుగా ఒక మెరుపు మెరిసినా, తిరిగి చిక్కటి చీకటి కమ్ముకునేది.

❖ అందరు వంశపారంపర్యపు వృత్తినే చేసుకోవాలి. పెక్కుమందికి అది ఏదో ఒక రూపంలో సేవకవృత్తి. పోతే, తక్కిన వారిలో కొందరికి అది వ్యవసాయం; మరొక కొందరికి ఏదో ఒక కుటీర పరిశ్రమ; ఇంకొక కొందరికి వాణిజ్యం, మిగిలిన కొందరికి శస్త్రాస్త్రధారణ, లేదా రాజ్యపాలన, లేదా మత ప్రచారం కాగా, ఆ రెండు ఖండాలకు కించిత్తు భేదం అని అనుభవిస్తూ వచ్చిన సంపదలో తరతమాలే. ఆసియాలో కొన్ని వృత్తులు ఎక్కువ వుండేవి; కొన్ని పరిశ్రమలు ఎక్కువ నైపుణితో సాగుతుండేవి; అందువల్ల కొంతవరకు ఎక్కువ సంపత్తి కానవచ్చేది. అంతేగాని, మానసిక దార్యానికి సంబంధించినంతవరకు, భావస్వాతంత్ర్యానికి సంబంధించినంత వరకు దీనివలె అదికూడా ఊసరక్షేత్రమే.

❖ లేమికంటె కూడా లేదన్న దుగ్ధ ఎక్కువ బాధాకరం. కలిమికంటె దాని ప్రదర్శనమే కొందరికి ఎక్కువ ఆనంద మిస్తుంది.

❖ తెలుగు పత్రికా సంపాదకులు కులపతిగా సంభావించదగు వ్యక్తి శ్రీ ముట్నూరి కృష్ణారావు. ఒకానొక సందర్భంలో తన ఆప్తమిత్రుడైన డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యను తన "కృష్ణాపత్రిక"లో ఆయన నిశితంగా విమర్శించాడు. అంతట వా రిద్దరికి సమానంగా స్నేహితుడైన ఒక ప్రముఖుడు శ్రీ కృష్ణారావు వద్దకు వెళ్ళి, "మీ విమర్శకు పట్టాభిగారు ఎంతో నొచ్చుకుంటున్నారు. విమర్శించినా, ఒక ప్రాణ స్నేహితుని ఇంత తీవ్రంగా విమర్శించడం భావ్యం కాదేమో!" అని చెప్పడం జరిగింది.

❖ అందుపై శ్రీ కృష్ణారావు తన తలపాగాను తీసి, "ఇదుగో! ఇతడు పట్టాభి మిత్రుడైన కృష్ణారావు. ఇతడు పట్టాభిపై ఈగనైనా వాల నివ్వడు" అన్నాడట. తీసిన తలపాగాను తిరిగి పెట్టుకుంటూ, "ఇదిగో! ఇతడు ఎడిటర్ కృష్ణారావు. ఇతడికి మిత్రులు లేరు, శత్రువులు లేరు, తనకు ప్రాణమిత్రుడైన పట్టాభి తప్పు చేసినా ఇతడు సహించలేడు" అన్నాడట!

❖ శ్రీ ముట్నూరి కృష్ణారావుతో సామ్యం పెట్టుకొనడం నాబోటివాని విషయంలో తప్పు కావచ్చుగాని, ఆయనను ఆదర్శంగా పెట్టుకొనడం తప్పుకాదు గదా? ఆయనను ఆదర్శంగా పెట్టుకొని, నా అంతస్థుకు తగినట్టు, ఆయన అడుగుజాడలలో నడవడానికి నేను ప్రయత్నిస్తున్నాను. నా సంపాదకీయ బాధ్యతలకు సంబంధించినంత వరకు నాకు మిత్రులు లేరు, శత్రువులు లేరు. ప్రజానాయకులైన వారిని, ప్రభుత్వ నాయకులైన వారిని, వ్యక్తిగతమైన రాగవిద్వేషాలతో ఎంతమాత్రం నిమిత్తం లేకుండా, వారి వర్తననుబట్టి, వారి విధానాలను బట్టి సమర్థించడానికో, విమర్శించడానికో నేను ఉద్యమిస్తాను. ఒకే వ్యక్తిని ఒక సందర్భంలో సమర్థించి, మరొక సందర్భంలో ఖండించడం జరిగితే, ఆయన పట్ల నామైత్రి విరోధంగా మారినందువల్ల కాదు; ప్రజానాయకుడుగా, లేదా ప్రభుత్వనాయకుడుగా, ఆ ప్రత్యేక సందర్భంలో ఆ వ్యక్తి వర్తన, లేదా ఆయన విధానాలు నా దృష్టిలో విమర్శనీయమైనవి అయినందునే.

❖ ఇది అసిధారావ్రతమని నాకు తెలుసు. దీన్ని అన్ని వేళలలో అకలంకంగా పాటించగల నైతికబలం నాకు లేదనికూడా తెలుసు. అయితే, నా శక్త్యనుసారం అందుకు ప్రయత్నం చేస్తూవుంటాను.

❖ జ్యోతిషం : నీపై నీకు లేని విశ్వాసమే జ్యోతిషంపై నీ విశ్వాసం.

చివరికి వ్యాధిని, మృతిని ఆలంబన చేసుకొనడానికైనా సంకోచించదు, కీర్తికాము కత్వం. కాస్త పేరు ప్రతిష్ఠలున్నవాడు పరమపదించగానే సంతాన ప్రకటనలు చేసే జక్కాయి, బుక్కాయిలలో హెచ్చుమంది కడుపులో నిజంగా దుఃఖంవున్నా, లేకపోయినా ఆ వంకతో తమ పేరు పత్రికల కెక్కాలని చూచేవారే! నలుగురి నోటా నలుగుతున్న వాడెవడైనా మంచమెక్కగానే పరామర్శకు బయల్దేరేవారిలో పెక్కుమంది నిజోద్దేశం కూడా ఆ రూపేణా తమ పేరు బయటకి రావాలనే. ఈ మధ్య జబ్బుపడిన – పంతులుగారిని తాము "నర్సింగ్ హోమ్" లో చూచి వచ్చామని, ఆయన కోలుకొంటున్నారని వార్త తెచ్చి, దాన్ని పత్రికలో ప్రచురించవలసిందిగా అనామకులు నన్ను వేపుకుతినడం కొన్ని రోజులుగా ఎక్కువై పోయింది. ఈ పనిమీదనే నిన్న వచ్చిన ఒక పడుచువానితో పంతులుగారు కోలుకొంటున్న మాట లోకానికి తెలుసునని, దాన్ని తిరిగి ప్రచురించవలసిన అగత్యం లేదని నే ననగా "కావచ్చు. కాని, పంతులుగారిని నేను దర్శించినట్టు తెలియాలి కదండీ!' అని బయటపడ్డాడు. ఓర్మి కోల్పోయి "తెలియ నక్కర లేదులెండి!" అని నే నన్నాను. "అయితే, డబ్బు యిస్తాను – వార్త వేస్తారా?" అని ఎర్రని తన ముఖం మరింత ఎర్రబడగా అడిగాడు. లోపలికి వచ్చినప్పుడే అతగాడు బంగారపు పిచ్చుక అనుకున్నాను. చేతికి బంగారపు గడియారం, బంగారపు గొలుసు, వేళ్లకు నాలుగైదు ఉంగరాలు పెట్టుకు వచ్చాడు. "డబ్బు యిస్తే మహరాజులా వేస్తాము. అయితే, మీరు డబ్బు యివ్వవలసినది నాకుకాదు; మా అడ్వర్టైజ్ మెంట్ మేనేజరుకు. ఆయన ఆఫీసు అదుగో అక్కడ!' అన్నాను. దిగ్గునలేచి "నమస్కారం" అంటూ వచ్చిన దారినే చక్కాపోయాడు. (1951)

మాటలు, చేతలు : నెహ్రూ నాయకత్వంపై ఒక రైలు ప్రయాణీకుడు కింది వ్యాఖ్యానం చేసినట్టు ఎవరో చెప్పగా విన్నాను; పడిపోతున్నట్టు పరుగుతీస్తున్న రైలు బండిలో నెహ్రూ బైఠాయించాడు. బండిని అందుకోలేక కొందరు, దాన్ని తప్పుకోలేక కొందరు హతమారి పోతున్నారు. వాళ్లను చూచి "అయ్యయ్యో!" అని నెహ్రూ నెత్తీ నోరూ కొట్టుకొంటున్నాడు. కాని, బండి ఆపడు, దాన్ని దిగడు.

చుక్కలకు నిచ్చెన వేస్తే, చూరువరకైనా ప్రాకగలమేమో!

నాగరికత పుట్టడమైనా, పెరగడమైనా నగరంలోనే. ఆంధ్ర నాగరికతకు పునర్వికాసం ఆంధ్ర మహానగర మొకటి నెలకొన్న పిమ్మటనే.

ఏసుక్రీస్తు, గౌతమ బుద్ధుని కాలాలనాడు కెమెరా లుంటే వా రుభయులు గాంధీజీవలె ఫోటోగ్రాపులలో నవ్వుముఖాలతోనే కనబడేవారు. నవ్వుతున్నట్టు వారిని చూపించి వుంటే శిల్పులు ఆ మహామహు లిద్దరికి మహాపచారం చేసివుండేవారు కూడా. జీసస్లో బాధాక్షమలను, శాక్యమునిలో శాంతకారుణ్యాలను మూర్తీభవింపజేసిన కళాస్రష్టల సరసన నిలవగలవాడు తలయెత్తితేనె మహాత్ముని దివ్యమంగళమూర్తికి న్యాయం జరగడం!

దీపావళి; నరకచతుర్దశి ఈయేడు చిన్నజల్లుతో ప్రారంభమైంది. తరులత గుల్మాదులు, పశుపక్ష్యాది సంతతికూడా మంగళస్నానం చేసింది. సన్న తుంపర పడి కాసేపటి లోనే వెలిసినా, పొగమంచువలె కమ్మిన మబ్బుతెర మాత్రం ఇంకా విచ్చుకోలేదు. అల్లంత దూరపు చెట్లు తెల్లని అంచులకు పట్టిన నాచువలె కనబడుతున్నాయి. దగ్గరి చెట్లమీద, ఇళ్ళ కప్పులమీద కూర్చున్న కాకులు రెక్కలను విరుచుకుంటూ, విదిలించు కుంటూ, ముక్కులతో వొంటిని గీరుకుంటూ, అభ్యంగానంతరం తల ఆరబెట్టుకుంటూ, కురులు చిక్కు తీసుకుంటున్న పేరంటాళ్ళను జ్ఞప్తికి తెస్తున్నవి. ఆకైనా అల్లల్లాడడం లేదు. కాని, చల్లగా వున్నది. మళ్ళీ జల్లుపడినా పడవచ్చు. పిండివంటల కోసం కాబోలు పొరుగింటిలో పిండి కొడుతున్నారు.

రోకటిపోటు ఏకతాళంవలె గతితప్పకుండా పడుతున్నది. మధ్యమధ్య, దగ్గరినుంచి ఒక్కొక్కసారి, దూరం నుంచి మరొక్కక్కసారి, టపాకాయల ప్రేలుడులు వినవస్తున్నవి. "అమ్మా! దీపావళి ఎలా వస్తుందే!" అని గారాంపోతూ నిన్న సాయంత్రం మా రెండవ పిల్లవాడు అడిగాడు. అది ఈ విధంగా వచ్చింది. (1951)

మానవుని జీవితంపై అశేషప్రభావం గల నిర్ణయాలు రెండు; వాటిలో మొదటిది వృత్తినిగురించినది, రెండవది వివాహాన్ని గురించినది. అయినా, ఈ రెండింటి విషయంలోను మన సంఘంలో స్వయంనిర్ణయం పూజ్యం. మన వృత్తిని నిర్ణయించేది కులం; వివాహాన్ని నిర్ణయించేవారు తల్లిదండ్రులు. స్వచ్ఛందంగా వృత్తిని యెన్నుకునే వారు, స్వయంవరం చేసుకునేవారు అసలే లేకపోలేదు గాని, అట్టివారు నూటికి పది మందిని మించరేమో! వ్యక్తిగత జీవితగమనంపై గంభీర ప్రభావం గల రెండు ముఖ్య నిర్ణయాలు కూడా వ్యక్తిగతంగా జరగనందునే మన సంఘం కేవల మొక గొర్రెల మంద.

హిందూసంఘం భద్రతకు పెట్టనికోట; స్వాతంత్ర్యానికి ఆగర్భశత్రువు. వ్యక్తికి సమష్టికుటుంబం భద్రత నిస్తుంది; సమష్టికుటుంబానికి కులవ్యవస్థ భద్రత నిస్తుంది. ఎన్ని తుఫానులు, మరెన్ని వరదలు వచ్చినా, ఈ ఉక్కుచట్రం హిందూ సంఘాన్ని రూపు చెడకుండా కాపాడింది. కాని, వ్యక్తులకు ఈ ఉక్కుచట్రంలో చీలలుగా తప్ప అస్తిత్వం లేదు; ప్రయోజనమూ లేదు.

మబ్బుపట్టిన ఒక రాత్రి : రాత్రి పది కావస్తున్నది. దీపావళి బాణసంచా టపటపలు ధణధణలు తగ్గిపోయాయి. చిక్కగా మబ్బు పట్టింది, చెదురుగా తప్ప చుక్కలు కనబడ్డంలేదు. పురుగులు అక్కడక్కడ సన్నని బెజ్జాలుకొట్టిన గొడుగును ఎండకెత్తి, పైకి చూచినప్పటివలె ఆకసం వున్నది. (1951).

ఇల్లు కట్టుకోవడం ఎండకు ఎండకుండా, వానకు తడవకుండా, చలికి గడగడ లాడకుండా సుఖంగా బ్రతకడం నిమిత్తమే కాదు. ఈ అనంత విశ్వంలో తానొక

క్షుద్రజీవినన్న బాధ లేకుండా తిరగాలంటే జీవితనాటకంలో తన విగ్రహానికి నిండుతన మివ్వగల రంగస్థలం మానవునికి కావాలి. రంగస్థలమే గృహం.

విజ్ఞానం విశ్వరూపం ధరించి ఆధునిక మానవుని వాల్లభ్యుని చేస్తున్నది.

చేతిలో బాగా డబ్బు మెదులుతున్న – చౌదరి, నాలుగైదు రోజులుగా నన్ను తరచు కలుసుకొంటున్నాడు. అతడి సంభాషణనుంచి కొన్ని మచ్చుముక్క లివి;

"నా సొంత ఖర్చు సాలుకు నలభైవేలు".

"మనకెంత భాగ్యంవున్నా మనం తిన్నదే, మనం ఖర్చు పెట్టుకున్నదే మనదని నా నమ్మకం".

"బాగా జలుబు చేసింది. మీబోటివారికైతే ఏ ఖర్చూ లేకుండా అదే పోతుంది; నేను వందరూపాయల మందులు
కొనవలసివచ్చింది."

"డబ్బిచ్చి మన మెవ్వరినీ సంతృప్తిపరచలేము. నేను డబ్బు ముట్టజెప్పను. కడుపునిండా భోజనం పెట్టి సంతృప్తి పరుస్తాను. విందుచేస్తే వెనకాముందూ చూచేదిలేదు, ఎన్ని వందలూ, వేలూ అయినా సరే!"

"ఎవరెవరో ఏవేవో పత్రికలు నాకు పంపిస్తూ వుంటారు. కొంతకాలమైన తర్వాత దేని చందా ఎంతో చూచి, అందుకు నాలుగైదు రెట్లకు ఒక చెక్కు వ్రాసి పంపిస్తూ వుంటాను. ఏ పనిచేసినా నేను సిస్టమాటిక్ గా చేస్తాను".

"ఎప్పుడూ నా వెంట నాలుగు జేబురుమాళ్లు వుంటాయి. ఒకటి ముక్కుకు, ఒకటి మూతికి, ఒకటి ముఖానికి, ఒకటి చేతులకు – దేనికి దాన్నే ఉపయోగిస్తాను."

కర్మనుబట్టి జన్మ అనే సిద్ధాంతం సంఘవంచితుల విప్లవాలనుంచి హిందూవ్యవస్థను కాపాడుతూ, వచ్చిన దనడం నిర్వివాదవిషయం. సంఘం వ్యక్తికి చేసే ప్రతి ద్రోహం పూర్వజన్మ కర్మానుభవమైనప్పుడు సంఘంపై తిరుగుబాటు ఎందుకు జరుగుతుంది?

తలలో పూలచెండ్లు : మన దేశంలో ఇంటి కొక పూలతోటలేని లోపాన్ని యిల్లాళ్ళు తీర్చుతున్నారు.

కార్తీకంలో ఒక ప్రాతఃకాలం : మిన్ను మబ్బులతో నిండి వున్నది. కింది వరసను పలకరంగుమబ్బులు, పై వరసను పాలనురుగుల మబ్బులు. నిండోలగంలో చెదురుగా కూర్చున్న స్త్రీలవలె, వీలాకాశం తునకలు ఈ రెండువరసల మబ్బులగుండా తొంగిచూస్తున్నవి. మిన్ను పైవలె మన్ను పై కూడా చలనం లేదు. ప్రకృతి, చిత్రపటంలో వలె, స్తబ్దంగా వున్నది.

ఒక పావుగంట తర్వాత : ఆకాశం తెంపులేని పలకరంగుకు మారిపోయింది. తూర్పు కిటికీగుండా చూస్తే సన్న తుంపర, పడమట కిటికీ వైపుకు తిరిగితే చినుకైనా లేదు. ఇంతలోనే తూర్పున ఎండతెర, పడమటిని ఇంద్రధనుస్సు,

అయిదు నిమిషాల తర్వాత : తూర్పున తుంపర నిలిచిపోయింది; పడమటిని ఇంద్రధనుస్సు కరిగిపోయింది. సన్నగా సాగిన గాలికి చెట్ల ఆకులు కదులుతున్నవి. మూగవోయిన పిట్టలు మళ్ళీ కూస్తున్నవి. నిద్రతో జోగుతున్నట్టు కనబడిన ప్రకృతి కళ్ళు నులుముకుని, వొళ్ళు విరుచుకుని, లేచి కూర్చున్నట్టు అయింది.

వానకురిసిన నాటి వెన్నెల నల్లగావుండి, జిడ్డుకారుతున్న ముఖానికి పూసిన టాల్కం పౌడర్ పూతను పోలివుంటుంది.

సంధ్యారాగానికి పులకరించడం వేదకాలంతోనే అంతరించింది; ఇప్పటికీ మిగిలింది సంధ్యావందనం మాత్రమే.

రావును ఎప్పుడు చూచినా ఆతని పెదవులపై పేరుకున్న మంచువలె చిరునవ్వు వుంటుంది. అతడినిగురించి నాకొక సందేహం : రాత్రిపూట నిద్రపోబోతూ, సూటును తీసి చిలకకొయ్యకు తగిలించినట్టు, చిరునవ్వును కూడా తగిలిస్తాడా అని.

ఎరువు యెక్కువైతే పంట రాలదు; పాండిత్యం మితిమీరితే రచన సాగదు.

మనువు తర్వాత కాసే యెండలో ప్రకృతి రెండు, మూడేళ్ల తర్వాత వెల్ల వేయబడిన లోగిలివలె వుంటుంది. బలమైనా, బలహీనతైనా మనకు మన దేశవిస్తృతిలోనే వున్నది, మన దేశభాషల వైవిధ్యంలోనే వున్నది. యూరోపియన్ రష్యాను మినహాయిస్తే, మిగిలిన యూరప్ ఖండం వైశాల్య మెంతో, అవిభక్త భారతదేశపు విస్తీర్ణ .మంత. విభక్తమైన తర్వాత మిగిలిన ఇండియా సయితం ప్రపంచరాజ్యాలలో పెక్కింటికంటె చాలా పెద్దదే. దేశ విస్తీర్ణంతో పోల్చినప్పుడు మన దేశభాషల సంఖ్య ఏమంత అధికమైంది కాదు. స్విట్జర్లెండ్ జానెడు, బెత్తెడు దేశమైనా, దానిలో నాలుగు భాషలున్నాయి. మొత్తం స్విస్ జనాభాకంటె ఒక్క తెలుగు మాట్లాడేవారి సంఖ్య ఇంచుమించు పదిరెట్లు. మన దేశవిస్తీర్ణంతో పోల్చినప్పుడు మన జాతీయ సంస్కృతికి వైవిధ్య మివ్వడానికి వలసిన పాటిగా మాత్రమే మనకు దేశభాష లున్నాయని దీని తాత్పర్యం.

వైశాల్యం రీత్యా ప్రపంచ రాజ్యాలలో బహుశా సప్తమ స్థానాన్ని ఆక్రమిస్తున్న మన దేశాన్ని సమైక్యంగా, శ్రద్ధాభక్తులతో సర్వతోముఖంగా అభివృద్ధిపరచుకొంటే, దానికి అగ్రరాజ్య ప్రతిపత్తి లభించడానికి అట్టే కాలం పట్టదు. ఇలా కాక, దేశంలోని పరప్రాంతాలవారు పరాయివారన్నట్టు వ్యవహరిస్తే అచిరకాలంలోనే మనకు తిరిగి అధఃపతనం తప్పదు కూడా. ఈ సూత్రమే మన దేశభాషలకు సయితం వర్తిస్తుంది. పరస్పర సుహృద్భావంతో, సామరస్యంతో ప్రాంతీయ భాషలను, సారస్వతాలను అభివృద్ధి పరచుకొంటే, సర్వసమృద్ధమైన జాతీయ సంస్కృతికి మనం నోచుకోగలుగుతాము; లేకపోతే, సంస్కృతికే దూరమై, సర్వవిధాల నీరసిస్తాము.

“దారి–బాట" అంటే నవ్వుతారు. "అగ్గి–నిప్పు" అంటే అపహాస్యం చేస్తారు.

“కంపస్ బాక్స్ పెట్టె” అంటే గేలిచేస్తారు. “కిరసనాయిల్ నూనె” అంటే తాటాకులు కడతారు. వీటిని పోలిందే “ఆంధ్ర– తెలంగాణా” కూడా. అయినా విశాలాంధ్రకు ఈ పేరునే పెట్టితీరాలని కొందరు పట్టుదల చూపించారు.

బౌద్ధంకంటె జైనం ప్రాచీనమతం. జైన తీర్థంకరులలో చిట్టచివరివాడైన వర్ధమానుడు గౌతమబుద్ధుని సమకాలికుడు. జైనమతాచార్యులలో ఆయన ఇరవై నాల్గవ వాడు కాగా, ఇరవై మూడవ తీర్థంకరుడైన పార్శ్వనాధుడు క్రీస్తుకు పూర్వం

ఎనిమిదవ శతాబ్దం వాడని ప్రతీతి. జైనపురాణాలు పేర్కొంటున్నట్టు, ఇరవై రెండవ తీర్థంకరుడు శ్రీకృష్ణుని సమకాలికుడైనా, కాపోయినా, జైనమతం బౌద్ధానికంటె ప్రాచీనమైన దనడం మాత్రం నిశ్చయం.

అయినా, దానికి బౌద్ధాని కున్న వ్యాప్తి లేదు. గౌతమబుద్ధుని ధర్మం చైనా, కొరియా, జపాన్ వరకే కాక, ఆపైన హవై దీవులకు కూడా వ్యాపించింది. 1961 డిసెంబర్ లో నేను హోనోలూలూ వెళ్ళినప్పుడు అక్కడ విన్న విషయాలలో దాదాపు మొట్టమొదటిది ఆ నగరంలో బుద్ధగయనుంచి తెచ్చి నాటిన అశ్వత్థవృక్షం కలదని. హవై ద్వీపవాసులలో ఈనాటికి కూడా అత్యధిక సంఖ్యాకులు బౌద్ధులే; ఈ విధంగా బౌద్ధం ఒక ప్రపంచమతం కాగా, జైనం భారతదేశంలో, సింహళంలో కొద్దిమందికి పరిమితం.

దాని వ్యాప్తి తక్కువైనా, జైనమత ప్రభావం మాత్రం తక్కువ కాదు. భారత సంఘంలో కొన్ని వర్గాలు మాంసమత్స్యాలను – వేద సంప్రదాయాలకు విరుద్ధంగా, వర్జించడానికి మూలకారణం బౌద్ధమని పెక్కుమంది భావిస్తారు. కాని, ఇది పూర్తిగా సత్యం కాదు. బౌద్ధులు శాకాహారులు కారు. గౌతమబుద్ధుని సయితం శాకాహారిగా పేర్కొనడానికి వీలు లేదేమో! భిక్షతో బ్రతకవలసిన పరివ్రాజకులు "మాకు ఇట్టి ఆహారమే కావాలి; అట్టిది కూడ" దని చెప్పడం సముచితం కానేరదని ఆయన భావించాడు. తమకు భిక్షచేయడానికై జీవహింస చేయడాన్ని బౌద్ధసన్యాసులు నిరోధించాలని ఆయన హెచ్చరించాడు. కాగా, తమకై మాంసాహారాన్ని సిద్ధంచేసుకొన్న గృహస్థులు దానినే పెడితే, బౌద్ధబిక్షువులు దాన్ని తిరస్కరించరాదని ఆయన ఆదేశించాడు. ఇంతేకాక, గౌతమ బుద్ధుని మహాపరినిర్వాణానికి విషపూరితమైన మాంసాహారమే కారణమని భావించ డానికి తగు అవకాశ మున్నదికూడా. ఏమైనా జీవహింస ఏ పరిస్థితులలోను ఎంతమాత్రం కూడ దనడంలో జైనమతాన్ని ప్రథమంగా పేర్కొనాలి. దాన్ని అహింసా ధర్మంగా వర్ణించవచ్చునేమో కూడా! ఆధునికయుగంలో అహింసా ధర్మప్రబోధకుడైన గాంధి పై జైనమత ప్రభావం ఇంతింత కాదు. సూర్యాస్తమయానికి ముందుగానే గాంధి రాత్రి భోజనాన్ని పూర్తిచేయడం సయితం జైన ప్రభావం వల్లనే!

బౌద్ధంవలె జైనం ఆంధ్రప్రదేశ్ లో ఎన్నడు విస్తారంగా వ్యాపించలేదు గాని, ఇక్కడికి అసలే ప్రాకకపోలేదు. జైన దేవాలయాలు, జైన శిల్పకళాఖండాలు ఈ నాటికి కూడా కానవచ్చే ప్రదేశాలు మన రాష్ట్రంలో వందకు పైగా వున్నవేమో!

మననుంచి బ్రిటిష్ వారు నేర్చుకొన్న ఒక దొడ్డ విషయం స్నానం చేయడం; వారి నుంచి మనం నేర్చుకున్న ఒక చెడ్డ విషయం ఆలస్యంగా నిద్రలేవడం.

వారిది చాలా చలిదేశం. అందువల్ల ప్రాతఃకాలాన్నే నిద్రలేవడం వారికి కష్టం. ఒకవేళ తెల్లవారుజామునే నిద్రలేచినా, అక్కడి చలివల్లనేమి, మంచువల్లనేమి పనిపాటలు సరిగా సాగవు. అందువల్లనే ప్రొద్దుపోయేవరకు వారు మేలుకొంటారు, ప్రొద్దెక్కేవరకు నిద్రపోతారు.

తమలో జితించిపోయిన ఈ అలవాటునే వారు మన దేశానికి తెచ్చారు. విద్యాలయాలు, న్యాయస్థానాలు, ప్రభుత్వకార్యాలయాలు మొదలైన వన్నీ తమ దేశంలో వలె ఇక్కడ కూడా పది, పదకొండు గంటలకు పని మొదలు పెట్టాలని ఉత్తరువు చేశారు.

వారిది ఎంత చలిదేశమో మనది అంత ఉష్ణదేశం. బారెడు పొద్దెక్కితే చాలు, మనకు చిటచిటలాడుతుంది. ఆపైన చిన్నమెత్తు పనికూడా సవ్యంగా సాగదు. అందువల్లనే తొలికోడికూతతో నిద్రలేవాలని మన పెద్దలు చెప్పారు. ఇదే విధంగా వారు చేసేవారు కూడా. పొరుగూరు ప్రయాణం పెట్టుకుంటే, ప్రొద్దు పొడిచేసరికి ఒక ఆమడ నడిచేవారు; నాగలి కడితే ప్రొద్దు ముదరకముందే ఒక అరకుంట కలిసేది. ఊడ్పు ఊడ్చినా, కోత కోసినా ఎండపడేసరికి రెండు మొనలు పూర్తిచేసేవారు. “గొడ్లకాడ బాగుజేయడం”, “గొడ్లను విడుచుకోవడం” ఇంకా మసకమసకగా వుండగానే జరిగేది. ఇల్లాలు వాకిలి జిమ్ముకోవడం,.

కలాపి జల్లుకోవడం, ముగ్గు పెట్టుకోవడం, మజ్జిగ చేసుకోవడం మొదలైన పనులన్నీ వేగుచుక్క పొడుస్తూవుండగానే పూర్తిచేసే. పిల్లలు తెలతెలవారుతుండగానే చల్దికి తయ్యారయ్యేవారు.

బ్రాహ్మణులు సూర్యోదయం వేళకు స్నానసంధ్యాది కర్మలలో నిమగ్నులై వుండేవారు; విద్యార్థులు అధ్యయనాన్ని సగం పూర్తిచేసేవారు. ఒక జాము పొద్దెక్కేసరికి కోమటి కొట్టులో ఆ పూటకు బేరం ముగిసిపోయేది. ఎండ పడకుండానే బిచ్చగాళ్ళు సయితం తమ జోలెలు నింపుకుని తమ మకాములు చేరుకొనేవారు.

పోతే, ప్రొద్దు నడినెత్తికి వచ్చేవరకు పనిపాటులు చేసుకోనివారు ఒక్క ఒడ్డి ఉప్పరులే. అందువల్లనే "ఉప్పర లగ్నం", "మిడసిరి లగ్నం" అనేవి వేళకాని వేళకు నుడికారాలైనాయి.

కాని, బ్రిటిష్ వారి నుంచి సంక్రమించిన అవగుణంవల్ల ప్రొద్దెక్కి లేవడం మనకు ఒక ఫ్యాషన్ అయిపోయింది. చివరికి పల్లెటూరి రైతు అతని పాలేరు కూడా తెల్లగా తెల్లవారిన తర్వాతగాని పొలంలో వంగడం లేదు.

బ్రిటిష్ వారి పోకడతో ఈ దురభ్యాసం కూడా పోకపోతే, మన దేశానికి చెరుపు తప్పదు. ఎండెక్కిన తర్వాత రెండు గంటలు పట్టేపని అంతకుముందుగా మొదలు పెడితే గంటలో అయిపోతుంది. అంతేకాదు, సగం శ్రమతో తెమిలిపోతుంది. ఏమైనా, ఇప్పటి పద్ధతి వృథాశ్రమకు, విలంబనకు మూలం కావడమే కాకుండా, స్వాస్థ్యానికి భంగకరం కూడా.

కలకంఠి కంట కన్నీ రొలికించ గలిగిందే కలకాలం నిలిచే కావ్యం.

"ధర్మం" అనే పదానికి నిఘంటువులు చెప్పే పుణ్యం, న్యాయం, స్వభావం, ఆచారం, వేదోక్తవిధి, ఉపనిషత్తు, యజ్ఞం, విల్లు, సత్కారం, నీతి అనే అర్థాలు మాత్రమేకాక దానితో ఎన్ని వందల, ఎన్నివేల సమాసాలు చేస్తే, అన్ని వందల, అన్ని వేల అర్థాలు రావడానికి

వీలున్నది. అందువల్ల "ధర్మరక్షణ" అని వినాయక దామోదర్ సావర్కార్ అంటే, అది హిందూధర్మరక్షణ కావచ్చు; కె.ఎమ్.ముల్టీ అంటే, అది ఆర్యధర్మరక్షణ కావచ్చు; మిన్నూ మసానీ అంటే, అది కుబేర ధర్మరక్షణ కావచ్చు.

పెరిగి విరిగినవాడు అసలు పెరగని వాడికంటె వెయ్యిరెట్లు నయం.

నిరతం నీతినిగురించి ప్రబోధాలు వినవచ్చే దేశంలో తల్లిని బిడ్డ నమ్మినా, తడిగుడ్డతో గొంతుకోత తప్పదు.

నడక తీరును బట్టి నడత తీరుకూడా వుంటుందని చెప్పవచ్చునేమో! పెళ్ళి నడకలు నడిచేవారు తాపీగా తప్ప పనులు చేయగలరా? అంగలు, పంగలు వేస్తూ నడిచేవారు ఆలస్యాన్ని సహించగలరా? ఈదురోమంటూ నడిచేవారు హుషారుగా వుండగలరా? లేడికి లేచిందే పరుగుగా నడిచేవారు చూచి రమ్మంటే కాల్చి రారా?

ఒక గాంధీజీ, ఒక పండిట్ జవహర్ లాల్, ఒక స్వామి రామతీర్థ ఇట్టి వారిని ఎవరినో కొందరిని విడిచి పుచ్చితే, మనది పెళ్ళినడకల జాతి. "పరుగులెత్తి పాలు త్రాగడం కంటే, నిలబడి నీళ్ళు త్రాగడం మేలు" అనేదాన్ని మన మొకజీవిత సూత్రంగా చేసుకున్నాము. "నిలబడి నీల్ళు త్రాగ" బట్టే కావచ్చు, మనజాతి నీళ్లు కారే స్థితిలో పడిపోయింది.

పాలు కావాలంటే పరుగులెత్తవలసిందే! పరుగులు, ఉరుకులు లేకుండానే యూరప్, అమెరికాలు పోయిన మూడు, నాలుగు శతాబ్దాలలో విశేషంగా పురోగమించాయా? ఆ మాటకు వస్తే, నరుని నాగరికతకే పరుగు మూలం కాదా?

"హంసయానం", "గజగమనం", "మందయానం" ఇది ఏనాడు మనకు ఉత్తమ స్త్రీ లక్షణమైందో ఆనాడే మన జాతీయజీవితంలో మాంద్యం ప్రవేశించినట్టు అనుకోవచ్చునేమో!

తెలుగు, తెగులు : ఈ రెండింటి సామీప్యం కాకతాళీయం కాదేమో!

"నిలబడితే ముందు నిలబడాలి" అనేవారు కొందరైతే, "ఎవరైనా ముందు నిలిస్తే, వారి వెన్నుకాయగల భారం మాదీ" అనేవారు మరికొందరు.

మొదటివర్గంవారే ప్రజాదృష్టిని అధికంగా ఆకర్షిస్తారు; వారే ప్రజల మన్ననను అధికంగా పొందుతారు, కాని, వెన్నుకాచే రెండవ వర్గంవారు లేకపోయిననాడు మొదటి వర్గంవారు అంత పొడగరులుగా కానరారు; అంతగా కంటదూరలేరు కూడా.

నాయకుడు కావడం గాని, నాయకునికి కుడిభుజం కావడం గాని వారివారి ప్రవృత్తినిబట్టి, వారి వారి ప్రతిభను బట్టి వుంటుంది. – నాయకత్వానికి తగు ప్రవృత్తి గాని, ప్రతిభగాని లేనప్పుడు దాన్ని ఆశించేవారికి. ఆశాభంగం తప్పదు; గౌరవభంగం తప్పదు. ఇట్టి విషాదానుభవాలు కొన్ని తటస్థించిన పిదప, లోకాన్ని నిందించడమే పనిగా పెట్టుకునే "వెంగళప్పలు" గా వారు తయారు కావడం కూడా తప్పదు.

ఆంధ్రప్రముఖులలో పెక్కుమంది రాణించవలసినంతగా రాణించకపోవడానికి కారణం నాయకుని కుడిభుజం కావలసినవారు. నాయకత్వాన్ని ఆశించడమేమో! నాయకత్వానికి సమస్తార్హతలున్న వారు తమకు కుడి భుజాలుగా ఉపకరించగలవారిని తగు రీతిని ప్రోత్సహించకపోవడం ఇందుకు మరొక కారణమేమో!

చెణుకులు, చురకలు

సంప్రదాయాలు

అన్యసంప్రదాయాన్ని అనుసరించగోరితే, దాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి, జాగరూకతతో అనుసరించాలి. లేకపోతే, అవకతవకలు జరుగుతాయి.

ఇంగ్లీషు భాషలో పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం ఇప్పుడు పెక్కుమంది అచ్చువేసి పంపిస్తున్న పెండ్లి శుభలేఖల సందర్భంలో – నిష్కర్షగా చెప్పాలంటే – ఎన్నెన్నో అవకతవకలు కానవస్తున్నాయి. వాటిని మా పాఠకుల దృష్టికి తీసుకువస్తున్నందుకు మమ్ము అపార్థం చేసుకోరని ఆశిస్తున్నాము; మాపై ఆగ్రహపడరని నమ్ముతున్నాము.

మాట వరసకి, పుల్లయ్యగారి కుమార్తె పెళ్లి జరుగుతున్నదనుకోండి. ఆయన పంపిస్తున్న శుభలేఖలు "శ్రీమతి, శ్రీ పుల్లయ్య" ల పేర ప్రస్తుతం వెడుతున్నాయి. పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం ముందుగా పేర్కొనవలసింది "మిస్టర్'నే, "మిసెస్"ను కాదు. అయినా, సభాసదులను ఉపన్యాసకుడు "లేడీస్ అండ్ జంటిల్ మెన్" అని సంబోధించడం సంప్రదాయం కాబట్టి, అదే అన్ని సందర్భాలకు వర్తిస్తుందన్న భ్రమవల్ల కాబోలు, మన శుభలేఖలలో ముందు 'శ్రీమతిని' పేర్కొని, తర్వాత "శ్రీ"ని పేర్కొనడం జరుగుతున్నది. ఎవరు ఈ పద్ధతిని ముందుగా ప్రారంభించారో తెలియదు కాని, ఇది శుద్ధ తప్పు.

భర్త ఇంటి పేరును బట్టి భార్య ఇంటి పేరు మారుతుంది. అందువల్ల 'మిస్టర్' తర్వాతనే 'మిసెస్' ను పేర్కొనాలి. ఇందుకు విరుద్ధంగా వెళ్లడం ఏ సంప్రదాయం ప్రకారమైనా సబబు కాదు.

పోతే, ఈ శుభలేఖలలో "సౌభాగ్యవతి" అనే మాటను "Sow" అని కుదిస్తున్నారు. ఇంగ్లీషులో "Sow" అనే మాటకు అర్థమేమిటో తెలిసినవారు ఈ పిచ్చిపని చేయరు.

ఇదే విధంగా "చిరంజీవి" అనే పదాన్ని "Chi" అని కుదించడం కూడా అపసవ్యమే. "Chi" అనే ఇంగ్లీషు వర్ణక్రమాన్ని "ఛీ" అని కూడా ఉచ్చరించడానికి వీలున్నదన్న సంగతిని ఈ సందర్భంలో గమనించాలి. ఈ ప్రమాదం వున్నప్పుడు "చిరంజీవి" అని పూర్తిగా అచ్చువేయడమే సముచితం కాగలదు.

పోతే, సంభాషణ సందర్భంలో "నా మిసెస్", "మీ మిసెస్" అనడం కూడా శుద్ధ తప్పు. "మిసెస్" తర్వాత విధిగా భర్త పేరు రావాలి. లేదా "మై వైఫ్", "యువర్ వైఫ్" అనాలి.

సంప్రదాయాలు సరిగా తెలియకపోతే, ఏ భాషలోనైనా ఇట్టి పొరపాట్లు జరగడం కద్దు. "మా ఆవిడ" మనకు నుడికారం. అది తప్పుకాదు. ఇదే ధోరణిలో "మా భార్య" అనడం ఎంత ఘోరమో మేము ప్రత్యేకించి వివరించ నక్కరలేదు.

ఇట్టి ఉదాహరణలు మరి కొన్నింటిని పేర్కొనవచ్చుగాని, సంప్రదాయాన్ని క్షుణ్ణంగా తెలుసుకొనకపోతే, దాన్ని జాగ్రత్తగా అనుకరించకపోతే, ఎన్ని అవకతవకలు జరగగలవో ఇప్పటికే మేము తగినంతగా వివరించగలిగినట్టు నమ్ముతున్నాము.

స్త్రీ సాహసం

సర్వసాధారణంగా స్త్రీ అబల కావచ్చు. పెక్కు సందర్భాలలో ఆమె సౌజన్యానికి, సౌకుమార్యానికి పర్యాయపదంగా చెల్లవచ్చు. కాని, ఆమె నిజంగా తలచుకుంటే ఆమెకు అడ్డుగా ఎంతటి పురుష పుంగవుడైనా నిలవలేడు.

తన హావభావవిలాసాలతో పురుషుడిని ఆమె ఇట్టే కట్టిపడవేస్తుంది. ఒక్క కన్నీటి బొట్టుతో పురుషుని కాఠిన్యాన్ని ఇట్టే కరిగించి వేస్తుంది. అన్యోపాయం తోచనప్పుడు ఇట్టే విజృంభించి, సాక్షాత్తు శక్తిస్వరూపిణిగా మారిపోతుంది.

మిడ్నపూర్ జిల్లాలోని ఒక పోలీసు స్టేషన్ పై ఇటీవల పది, పన్నెండుమంది స్త్రీలు దాడి చేశారట; ముగ్గురు కాపలావారిని చితకగొట్టి పదహారు మణుగుల బియ్యాన్ని దోచుకుపోయారట.

ఇంత తెగించడానికి వారికి బలవత్తరమైన కారణ మేదో వుండాలి. ఆకలికి నకనకలాడుతున్న తమ పసికందుల ప్రాణాలు నిలుపుకొనడమే ఆ కారణం కావచ్చు.

వారు చేసింది అరాజకచర్యే అయినా, దౌర్జన్యకృత్యమే అయినా, దోషం పూర్తిగా వారిపై నెట్టివేయడం భావ్యం కాదేమో! ప్రజలకు సక్రమంగా ఆహార ధాన్యాలను

సరఫరా చెయ్యడంలో విఫలమైపోతున్న పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కూడా ఇందుకు కొంత బాధ్యతను పంచుకోవాలి. తన సంతానం కోసం స్త్రీ ఏమైనా చేస్తుంది, ఎందుకైనా సిద్ధపడుతుంది.

వసపోసిన పిట్ట

వసకు, వాగుడుకు సంబంధం వున్నట్టు "చరకసంహిత"లో వ్రాసి వున్నదో, లేదో, ఆ వైనం మాకు తెలియదు. కాని, ఎక్కువగా వాగేవాడిని "వసపోసిన పిట్ట" అంటారు.

ఉగ్గుతో కలిపి హెచ్చుగా వసపోస్తే వాగుబోతుతనం పుట్టుకురావడం నిజమైతే, వెస్టర్ ఎం.ఇ బ్రెడ్ అనే ఆస్ట్రేలియా పౌరునికి అతని తల్లి కొన్ని మణుగుల వసపోసిందనే అనుకోవాలి. ఆగకుండా వాగడంలో తనను మించిన ఘనుడు ప్రపంచం మొత్తం మీదనే లేడని రుజువు చేయడం కోసం ఈ మానవుడు 118 గంటల మీద ఒక నిముషంపాటు ఈ మధ్యనే వాగుతూపోయాడు.

ఇదివరలో ఈ విషయంలో ప్రపంచం మొత్తం మీద 'రికార్డు '' క్లైవ్ జోర్టిన్ సన్ అనే అమెరికన్ పౌరుని కున్నదట. అతనిసుంచి ఈ ఘనతను కొట్టి వెయ్యడానికి బ్రయిడ్ అతనికంటే ఎక్కువగా ఒక గంట ఒక నిమిషము సేపు ఏకబిగిన వాగుతూ పోయాడు..

ఒక ఘనతకోసం అని వచ్చి ఘనతైనా బ్రైడ్ దాదాపు అయిదు రోజులపాటు నిద్రాహారాలు మాని వాగుతూ పోయాడనుకోండి. కాని, దాన్ని చిన్న వారు ఎలా విన్నారో ఇన్ని రోజులపాటు ఒక రెవరైనా అతడి వాగుడును వినివుంటే మాత్రం నిజమైన ఘనత వారిదే.

"బ్లేజ్ వాడ"

ఇది బెజవాడ కాదు, బ్లేజ్ వాడా అని చాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి ఎన్నడో చమత్కరించారు. ఆయనే "ఈ పట్టణంలో మూడు ఋతువులున్నాయి ; హాట్, హాటర్, హాటెస్ట్" అని మరొక వినురు విసిరినట్టు కూడా ప్రతీతి. ఇక్కడి వేడిమిని భరించలేకనే ఆదిలో ఇక్కడ నెలకొన్న ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆయన వాలేరుకు తులించుకు వెళ్ళారు.

మామూలుగా విజయవాడలో మండు వేసవి సాలుకు ఆరు నెలలు కాగా, ఈ సంవత్సరం తొమ్మిది నెలలకు విస్తరించింది. సెప్టెంబరు ఆఖరువరకు ప్రాణాలు తల్లడిల్లిపోయాయి.

ఇంద్రకీలాద్రిపై చెట్లను నాటితే, అది "అగ్నికీలాద్రి"గా మిగలదని విజయవాడ వాతావరణం కొంత చల్లబడుతుందని డాక్టర్ కె.ఎల్.రావు గారి అత, పురపాలక సంఘాన్ని ప్రోత్సహించి, ఇందుకు ఆయన ఒక పథకాన్ని అమలు జరిపిస్తున్నారు కూడా.

ఈ పథకం మంచిదే కావచ్చు. కాని, ఇది జయప్రదం కావాలంటే, కొండ పైకి మేకలు, ఆవులు ఎక్కకుండా ఆపాలి. చెట్లు కాస్త పెరగగానే వాటిని వంట చెరకుకింద కొట్టుకు పోకుండా ఆపాలి. ఈ విషయాలలో విజయవాడ పౌరులు ఎంతవరకు సహకరిస్తారో మా మట్టుకు మాకు సంశయమే.

కాకమ్మ కథలు

“అగ్ని దేవత" హైదరాబాదు వచ్చిందట. దాని అదృశ్యహస్తమే ఆ నగరంలోని ఒక ప్రాంతంలో అగ్ని ప్రమాదాలను కలిగిస్తున్నదట.

ఇట్టి మూఢవిశ్వాసం ఎవరిలోనైనా క్షంతవ్యం కావచ్చుగాని, పోలీసు అధికారుల విషయంలో కాగలదా? అయినా, వారే “ఇది అగ్నిదేవత అఘాయిత్యమే" అని చెబుతున్నారట.

ఈ సంగతి వినగా “ఇది క్రీస్తుశకంలో ఇరవయ్యో శతాబ్దమేనా?” అని ఆశ్చర్యపడవలని వస్తున్నది. ఆదినరుని శిలాయుధాలను, ఇతర పరికరాలను చూచి, వాటిని మానవాళి పాపాలకు కినిసి, దేవతలు కురిపించిన పిడుగురాళ్లుగా నూరు, నూట యాభై సంవత్సరాల క్రింద యూరప్ లో భావించేవారట. ఇప్పటి హైదరాబాద్ కథను విన్నమీదట మనం మరింత వెనుకటికాలంలోనే మిగిలివున్నట్టు తీర్మానించుకోవలసి వస్తున్నది.

అగ్నిదేవతకు నిజంగానే ఆగ్రహం వస్తే, సీతాఫల్ మండిలో వున్న ఒక గూడెంపైనే ఎందుకు రావాలి? చేతిలో ఒక కాగడా పుచ్చుకుని అక్కడనే ఎందుకు తిరగాలి? ఆ గూడెంలోనే పాపం గూడు కట్టుకున్నదా?

ఇట్టి కాకమ్మకథలే కడిగిపోసిన సత్యాలుగా చెల్లినంతవరకు మనకు పురోగతి లేదు, భవిష్యత్తు లేదు.

అతి చనువు

గోవు సాధుజంతువని ప్రసిద్ధి. అయినా, దానికైనా అప్పుడప్పుడు తిక్క రేగవచ్చు. బ్రజల్ ముఖ్య పట్టణం రియో ద జనేరోలో ప్రస్తుతం ఒక కర్షకుడు వైద్యాలయంలో చికిత్స పొందుతూ ఈ సత్యాన్నే నెమరువేసుకొంటున్నాడు.

అది తాను అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఆవు. దానికి ముప్పొద్దుల తన చేతులతోనే మేత వేస్తూవుండేవాడు నీరు పెడుతూవుండేవాడు, దాన్ని ప్రేమతో నిమురుతూ వుండేవాడు.

ఇంతటితో ఆగక, ఆ రైతు తన ఆవును ముద్దాడుతూ వుండేవాడు కూడా. తనతో మరీ ఇంత చనువు చేసుకొనడం దానికి మనస్కరించినట్టు లేదు. ముద్దాడినా పడుచువాడైతే ఆ దారి వేరు. మరి ఇతడేమో డైబ్బై దాటినవాడు. “ఈ ముసలివాడికి నాతో శృంగారమేమిటి?” అని కాబోలు మొన్న అతడిని అది వాడికొమ్ములతో పొడిచింది; డొక్క చీల్చి, డోలు కట్టినంత పనిచేసింది.

ఈసప్ ఈ కథను వ్రాసివుంటే “ఎంతటి సాధుజంతువైనా అతి చనువును సహించలేదు” అనే నీతిని చివర చేర్చేవాడేమో.

మానసిక వ్యాధి

టీ త్రాగితే కేన్సర్ వస్తుందట. 'టండూరీ చికిన్” (నిప్పు సెగపై కాల్చిన కోడి మాంసం) తింటే కేన్సర్ వస్తుందట. ఈ విధంగా హెచ్చరికలు చేస్తూ పోతున్న డాక్టర్లు మరికొంత కాలానికి గాలి పీల్చినా కేన్సర్ వస్తుందని చెప్పవచ్చు. అప్పుడు కేన్సర్ కు భయపడి మనం గాలి పీల్చడాన్ని మానివేయగలమా?

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయాలనడం మా తాత్పర్యం కాదు గాని, ఏమి త్రాగితే, ఏమి తింటే ఏమి జబ్బు వస్తుందో అని భయపడుతూపోతే సుఖంగా బ్రతుకు వెళ్ళమారగలదా? "కంద, కాక, బెండ వాతం, కాకర పైత్యం, చింత శైత్యం” అంటూ కూరగాయలన్నింటిలో ఏదో దోషాన్ని చూచే గృహస్థు తన బ్రతుకును చికాకు పరచుకొనడమే కాక, తన ఇల్లాలు బ్రతుకును కూడా చికాకు పరుస్తాడు.

రాగల వ్యాధుల గురించి భయాందోళనలు చెందడం ఒక వ్యాధే. అది మానసిక సంబంధమైన వ్యాధి. అది ప్రవేశించనే రాదు గాని, ఒకసారి ప్రవేశించిందా, మరి దానికి మందు లేదు.

పైకి వెళ్ళగానే

భూతలంపై పని చేసినట్టు రోదసిలో మానవుని మెదడు పని చేయదట. తాను కొనసాగించిన శాస్త్రీయ పరిశోధనల ఫలితంగా ఈ విషయాన్ని కనుగొన్నట్టు ఒక అమెరికన్ వైజ్ఞానిక శాస్త్రవేత్త ప్రకటిస్తున్నాడు.

కాని, ఈ విషయాన్ని కనుగొనడానికి వైజ్ఞానిక శాస్త్రవేత్తలు కావలెనా? ఇందుకోసం వారు శాస్త్రీయ పరిశోధనలు కొనసాగించవలెనా?

రోదసివరకు దేనికి? ఏ కొంచెం పైకి వెళ్ళినా సరే, ఎందరి మెదడులలో ఎన్నెన్ని వికారాలు, ఎంతగా పుట్టుకు వస్తాయో మనం ప్రతినిత్యం చూడ్డంలేదా? పాత రోజులను మరచిపోవడంతో, పాత స్నేహితులను గుర్తుపట్టలేకపోవడంతో ఈ వికారాలు ప్రారంభమై, రకరకాలుగా తెగ బలిసిపోతాయి.

కొంచెం పైకి వెళ్ళేసరికి తల తిరగడం, కళ్ళు నెత్తిపైకి పోవడం, మెడ తిరగకపోవడం నోటినుంచి దురుసుగా మాట రావడం మొదలైన దుర్లక్షణాలు ఎన్నో పొటకరిస్తాయి.

ఈ పైకి వెళ్ళడం రాజకీయరంగంలో జరిగితే, ఇక సరేసరి. అప్పుడు నూటికి తొంభైమంది తాము ఈ భూతలానికి చెందనట్టు, ఏదో ఊర్ధ్వలోకంలో కొలువుతీర్చి కూర్చునట్టు ప్రవర్తించడం కద్దు.

ఎంత పైకి వెళ్ళితే అంత సహజంగా, అంత వినమ్రంగా ప్రవర్తించడం ఏ కొద్దిమందికి మాత్రమే చెల్లు. ఈ భూతలాన్ని ఎప్పటికైనా స్వర్గధామంగా మార్చగలిగేది అట్టివారే.

తలవాపు

ఈ మధ్య బొంబాయిలో "కాళ్లవాపు" జబ్బు కనబడుతున్నదట. దీనికి కారణాన్ని డాక్టర్లు . నిర్ధారణగా చెప్పలేక పోతున్నారట. కలీ కలిపిన వంటనూనెల వల్ల ఇది వస్తున్నదేమో అని వారు అనుమానిస్తున్నారట.

"బోదకాలు" రూపంలో కాళ్లవాపు జబ్బు పాతదే. నంజు కారణంగా కూడా కాళ్లువాయడం కద్దు. ఇట్టి పాతవాటికి తోడు ఇప్పుడు మరొక "కాళ్లవాపు" జబ్బు బొంబాయికి వచ్చింది కాబోలు.

కాళ్లవాపు జబ్బు ఏవో కొన్ని రకాలైతే, తలవాపు జబ్బు లక్ష రకాలు. దానికి కారణాలను చెప్పడానికి డాక్టర్లతో పనివుండదు. ఎవరైనా వాటిని ఇట్టే కనుక్కోవచ్చు.

కొత్తసిరి అబ్బగానే కొందరికి తల వాస్తుంది. అధికారం అబ్బగానే కొందరికి తల వాస్తుంది. ఏ కాస్త కీర్తి ప్రతిష్ఠలబ్బినా కొందరికి తల వాస్తుంది. తమకేమీ అబ్బకపోయినా, ఒక శక్తిమంతుని సరసకు, ముఖ్యంగా ఒక మంత్రి సరసకు చేరగలిగితే కొందరికి తల వాస్తుంది. కాగా, కొందరు దౌర్భాగ్యుల విషయంలో తిట్లు తినగా, తినగా తల వాస్తుంది.

ఈ తలవాపు జబ్బు పురుషులకే కాదు, స్త్రీలకు కూడా రావడం కద్దు; పెద్ద వారికే కాదు పిన్నలకు కూడా రావడం కద్దు. ఏ జబ్బుకైనా మందు దొరకవచ్చుగాని, ఈ తలవాపు జబ్బుకు అది దొరకదు. పైగా, ఈ జబ్బువల్ల బాధపడేది అది వచ్చిన వారు కాదు; లోకులే.

కవిబ్రహ్మలు

బ్రహ్మసృష్టికంటె కవిబ్రహ్మసృష్టి విశిష్టమైనదా? విశిష్టమైనది కాకపోయినా, అది నిశ్చయంగా విఖ్యాతమైనదే.
మేనక ఎందరు పిల్లలను కనిందో, ఎందరిని పారవేసిందో, వారి పేరులైనా మనకు తెలియవు. కాని, శకుంతలకు శాశ్వత కీర్తి లభించడం కాళిదాసు చలవవల్లనే.

శకుంతల కనీసం ఒక అమ్మ కన్నబిడ్డ. కవిబ్రహ్మలైనవారు తల్లి గర్భం నుంచికాక, తమ మస్తిష్కం నుంచి పుట్టిన బిడ్డలకు సయితం శకుంతల పేరు ప్రతిష్ఠలకు సాటిరాగలవాటిని సంపాదించి పెడుతూవుంటారు.

కానన్ డాయిల్ మస్తిష్కంలో నుంచి పుట్టిన పత్తేదారు షెర్లాక్ హోమ్స్. కాని, నిజమైన ఏ పత్తేదారుకు అతనికున్న పేరు ప్రఖ్యాతులు లేవు.

లండన్ లోని బేకర్ స్ట్రీట్లో షెర్లాక్ హోమ్స్ నివసిస్తూ వుండేవాడని డాయిల్ వ్రాశాడు. అందువల్ల తీర్థయాత్రికులవలె అక్కడికి షెర్లాక్ హోమ్స్ భక్తులు రావడం ప్రారంభించారు. వారికి ఆశాభంగం కలిగించకుండా అక్కడ ఒక హోమ్స్ క్లబ్బును కొన్నేళ్ళ క్రితం నెలకొల్పవలసి వచ్చింది.

లండన్ లోని బేకర్ స్ట్రీట్ లోనే కాదు, జినీవాకు దగ్గరగా మరొకచోట కూడా ఒక షెర్లాక్ హోమ్స్ స్మారకచిహ్నం వెలిసింది. దొంగ దూరిన కారణంగా అది నేడు వార్త కెక్కింది.

కడుపుకు ఇంత తిని ఆ దొంగ వెళ్ళిపోయాడు గాని, అంతకు మించి దేనినైనా దొంగిలిస్తే, ఎంతో దూరం అతడు పారిపోకముందే, ఇతరులకు తోచని ఆరాలు ఇట్టే తీసి, అతడిని షెర్లాక్ హోమ్స్ పట్టివేసి వుండేవాడే.

చెట్టు – కాయలు

"చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకోవడం" అతి ప్రాచీనమైన వ్యాపారసూత్రం. ఏదో ఒక ఘనత వున్నట్టు చెప్పకపోతే, నాసి సరుకును ఎవరు కొంటారు, ఎందుకు కొంటారు?

అయితే చెట్టుకు, కాయలకు తల్లీబిడ్డల సంబంధం వుంటుంది. అందువల్ల చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకొనడం సమర్థనీయమైనా, కాకపోయినా, దాన్ని కొంత వరకు అర్థం చేసుకోవచ్చు.

కాగా, మనకు ఎంతమాత్రం అర్థంకాని విషయం నెహ్రూకు ఏ బీడీలతోనో, గాంధికి ఏ చుట్టలతోనో పొత్తుకలిపి, వాటిని అమ్మజూపడం.

నెహ్రూ బీడీలు, గాంధి చుట్టలు మార్కెట్లో వున్నాయో, లేవో మాకు తెలియదుగాని, మన దేవతల పేర్లతో చెలామణి అవుతున్న సబ్బులు, సెంటులు, హెయిర్ ఆయిల్స్ వగైరాలు ఎన్నెన్నో వున్నాయి. దేవతల పేర్లనే ఈ విధంగా తమ వ్యాపారాభివృద్ధికై వినియోగించుకొనేవారు, నాయకుల పేర్లను వాడుకోవడం అబ్బురం కాబోదు.

ఇండియాలో ఏమి జరుగుతున్నదో తెలియకనే కావచ్చు, లండన్ లోని సింహళం హైకమిషనర్ ఆక్స్ ఫర్డ్ స్ట్రీ లోగల ఒక వ్యాపారసంస్థ బుద్ధ భగవానుని పేరును ఒక అభ్యంగన తైలానికి పెట్టడాన్ని ఆక్షేపించాడట. ఇందుపై ఆసంస్థ క్షమాపణ చెప్పుకుని, ఆ తప్పును మరి చేయనని చెప్పిందట.

వ్యాపారాభివృద్ధికి దేవతల పేర్లను వినియోగించుకొనడాన్ని మన దేశంలో ఆక్షేపించరు సరిగదా, వ్యాపార ప్రకటనలతో కూడిన దేవతల చిత్రపటాల క్యాలెండర్లు తమకు ఉచితంగా లభిస్తాయని, ఆ బొమ్మలకే "ఫ్రేము" కట్టించి, వాటికి పూజ చేయడం కద్దు. ఇట్టివారి భక్తినే కాక, వీరి సంస్కృతినికూడా శంకించవలసి వస్తుంది.

హృదయ కవాటాలు

"హృదయ కవాటం" అనే ప్రయోగం మన ప్రాచీన కావ్యాలలో వున్నదో లేదో జ్ఞప్తి లేదు గాని, ఆధునికులు దీన్ని ప్రయోగిస్తూ వుంటారు. కొందరు దీని బహువచన రూపాన్ని ప్రయోగించడం హడా కద్దు.

అయితే, హృదయానికి ఎన్ని కవాటాలున్నవో వీరు లెక్క తేల్చి చెప్పరు. మన ఆయుర్వేద గ్రంథాలు మాత్రం ఈ విషయంలో సందేహానికి ఆస్కారం లేకుండా చేశాయి. గుండెను అవి ఒక ఇంటితో పోల్చాయి; ఆ ఇంటికి తొమ్మిది ద్వార బంధాలున్నాయని చెప్పాయి. పూర్వకాలంలో ఒక్కొక్క ద్వారబంధానికి ఒక్కొక్క కవాటమే వుండేది కాబట్టి, హృదయ కవాటాల సంఖ్య తొమ్మిది అని తీర్మానించుకోవచ్చు.

హృదయ కోశాన్ని గురించి ఆయుర్వేద గ్రంథాలు పేర్కొన్న విశేషాలను మరికొన్నింటిని కూడా ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ గోష్ఠిలో ఇది హృదయ కోశానికి సంబంధించిన రుగ్మతల విషయమై కొనసాగుతున్న గోష్ఠి డాక్టర్ ఆర్.జె.వకీలు తెలియజేశారు. ఆయన తెలిపిన ఇతర విశేషాల జోలికి పోకుండా హృదయ కవాటాల లోపలనే మనం ఆగిపోదాము.

తొమ్మిది ద్వారబంధాలు, తొమ్మిది కవాటాలు కాక, అవి తొంభై, ఇవి తొంభై వున్నా చాలినన్ని కావేమో, ప్రేమ, ద్వేషం, ఆశ, నిరాశ, సంతోషం, దుఃఖం, శాంతం, క్రోధం, స్వార్థం, త్యాగం, లోభం, దాతృత్వం ఈ విధంగా వేలాది గుణావగుణాలు తమతమ ప్రకృతినిబట్టి దేవతారూపంలోనో రాక్షసరూపంలోనో మన హృదయ మందిరంలోకి ప్రవేశిస్తూ వుంటాయి; దాని నుంచి నిష్క్రమిస్తూ వుంటాయి. వాటి ప్రవేశ నిష్క్రమణాలకు తొమ్మిది ద్వారాలు . సరిపోతాయా? వాటి ప్రవేశ నిష్క్రమణలను కంట్రోల్ చేయాలంటే తొమ్మిది కవాటాలైనా సరిపోతాయా?

హృదయ ద్వారాల సంఖ్యను, దాన్నిబట్టి హృదయ కవాటాల సంఖ్యను, నిర్ణయించిన మన వైద్యుల కంటె వాటి సంఖ్యను ఊహకు విడిచి పెట్టిన మన కవులే ఎక్కువ విజ్ఞులేమో.

ముక్కోపానికి మూలం

మానవుడు సంఘజీవి. మానవుడే కాదు, జంతువులలో కూడా అనేకం సంఘ జీవనాన్నే అభిలషిస్తాయి.

సంఘజీవనంవల్ల కలిగే అనేక సౌకర్యాల మాట అటుంచి, దానవల్ల మానసిక సంస్కారం కూడా పెరుగుతుంది. "నన్ను ముట్టుకోకు, నామాల కాకి" అన్నట్టు సంఘానికి దూరంగా, ఒంటరిగా వుండేవారు క్రమంగా మానవత్వానికే దూరం కావచ్చు.

దీనికి శాస్త్రాధారం కూడా వున్నట్టు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన శాస్త్రవేత్తల సమావేశంలో వెల్లడైంది. పూర్తిగా ఏకాంతవాసం చేసే జీవి మెదడులో కొన్ని రసాయనికపు మార్పులు సంభవిస్తాయట. వాటి ఫలితాలు ప్రవర్తనను కూడా మార్చివేస్తాయట. చుంచులపై చేసిన కొన్ని ప్రయోగాలను బట్టి శాస్త్రవేత్తలు ఈ విషయం కనుగొన్నారట. ఉదాహరణకు,

ఒంటరిగా వుంచిన చుంచులకు తల తిరుగుడు రోగం కలిగిందట, కోపం పెరిగిందట, దౌర్జన్యతత్వం ఎక్కువైనదట.

పెద్దపులి, సింహం వంటి కొన్ని జంతువులు సాధారణంగా మందలుగా కాక, విడివిడిగా జీవిస్తాయి. వాటి క్రౌర్యానికి ఇదే కారణమేమో,

పూర్వం మన ఋషులు ఏ హిమాలయాలకో పోయి, ముక్కు మూసుకుని, తపస్సు చేసేవారు. వారిలో కామాన్ని జయించిన వారుండవచ్చు గాని, క్రోధాన్ని జయించిన వారు తక్కువే. దూర్వాసుడు, విశ్వామిత్రుడు వంటి ఋషులకు కోపం ముక్కుపైనే

వుండేది. చీటికీ మాటికీ వారు చిరాకు పడుతుండేవారు; కాస్తకూ కూస్తకూ కూడా ఒక శాపాన్ని తగిలిస్తుండేవారు. ఏకాంత జీవనమే, దానివల్ల వారి మెదడులో కలిగిన రసాయనికపు మార్పులే వారింతగా ముక్కోపులు కావడానికి మూలమేమో!

చిన్నారి, పొన్నారి చాకు

"కత్తి మెత్తనా, అత్త మంచీ లేదు" అని సామెత. అన్ని సామెతల వలె ఇది కూడా అర్ధసత్యాన్నే చెబుతున్నది. అత్తలందరు చెడ్డవారు కారు; అదే విధంగా కత్తులన్నీ చెడ్డవి కావు.

చాకు కూడా ఒక కత్తే. తక్కినవి పెద్ద కత్తులు కాగా, అది పిల్లకత్తి. పిన్నలకు, పెద్దలకు ముఖ్యంగా పిన్నలకు చాకు ఎన్నెన్ని విధాలుగానో వినియోగపడుతుంది. పెన్సిల్ ముక్కు చెక్కాలంటే వారికి చాకు కావాలి. గాలిపటం కట్టుకోవాలంటే చాకు కావాలి. చాటుమాటుగా చెట్టెక్కి కోసుకున్న ఏ మామిడికాయనో ముక్కలుగా కోసి తినాలంటే చాకు కావాలి. చాక్లెట్ల డబ్బా మూత విప్పాలంటే చాకు కావాలి. ఇన్ని పనులకు చాకు కావాలి కనుకనే అది లేకపోతే పిల్లలకు తోచదు. తాత చెప్పిన ఏ వీరగాథనో విన్న తర్వాత వారు నిద్రపోవడం తటస్థిస్తే, బ్రహ్మ రాక్షసుని బారినుంచి రాకుమారిని తప్పించడానికై అతనితో తాము చాకుతో యుద్ధం చేసి, విజయం సాధించినట్టు వారు కలలు కంటారు కూడా.

చాకు ఇంతగా పిల్లలకు ప్రేమపాత్ర మైనది కాబట్టే కాబోలు, కలం స్నేహితులు దాన్ని ఒకరికొకరు బహుమానంగా పంపుకుంటారు. ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ, మన రాష్ట్రపతికి అతిధిగా వున్న ప్రెసిడెంట్ నాసర్‌కు ఒక ఢిల్లీ పిల్ల మొన్న ఒక చాకును కాగితంలో చుట్టి పంపించిందట. రాష్ట్రపతి భవనంలో దాన్ని అందుకున్న వారు ఆ చుట్టను విప్పితే ఏమి ప్రమాదమో అని ముందు భయపడినారట. సాహసించి ఒక శిఖ్కు సెంట్రీ దాన్ని విప్పగా ఒక చిన్నారి పొన్నారి చిన్ని చాకు కనబడిందట. దాన్ని అందుకోడానికి నాసర్ ఎంతో సంతోషించారట.

ప్రపంచంలోని కత్తులన్నీ చాకులుగా మారితే, ఇంతకంటే ముఖ్యంగా పెద్దలలో పసివారి సహజత్వం మిగిలితే, మన ప్రపంచస్వరూపమే మారిపోదా?

కృత్రిమ హృదయాలు

ఇది యాంత్రికయుగం. దీనిలో స్పేర్ పార్టులు లేనిదే ఒక పూటైనా జరగదు. యంత్రంలో ఏదో ఒక భాగం అరగవచ్చు, విరగవచ్చు. దాన్ని తీసివేసి, వెంటనే కొత్త దాన్ని వెయ్యాలి. లేకపోతే యంత్రమే మూలబడుతుంది.

మానవ శరీరం కూడా ఒక యంత్రమే. అయినా, దీనికి స్పేర్ పార్టులను ఆ పాడు బ్రహ్మదేవుడు ఏర్పాటు చేయలేదు. ఈ లోపాన్ని తీర్చుకొనడానికి కొన్నివేల సంవత్సరాలపాటు మానవుడు స్వయంగా కృషి చేయవలసి వచ్చింది.

ఇంతవరకు తన కృషి పూర్తిగా ఫలించకపోయినా, మొత్తంపై మానవుడు కొంత విజయాన్ని సాధించకపోలేదు. అసలు కన్నుపోతే మరొకటి పెట్టడం కొన్నేళ్ళ క్రితం ప్రారంభం కాగా, దెబ్బతిన్న గుండెకు బదులుగా కొత్త దాన్ని తగిలించడం ఈ మధ్యనే మొదలైంది. లాస్ ఏంజెకు చెందిన ఒక డాక్టర్ కృత్రిమపు గుండె కాయలను భారీ యెత్తున తయారు చేస్తున్నాడని నిన్ననే ఒక వార్త వచ్చింది. తాను తయారు చేసిన రెండు గుండెకాయలను ఆయన స్వయంగా వాడి చూచినాడట. అవి చక్కగా పని చేస్తున్నాయట.

ఛలోక్తిగానే కావచ్చు గాని, ఈ సందర్భంలో ఒక సందేహం తోస్తున్నది. సహజమైన హృదయ కోశాలున్న వారే కృత్రిమంగా ప్రవర్తించడం నానాటికి అధికమైపోతున్నది. అయినప్పుడు కృత్రిమ హృదయాలు విరివిగా వాడుకలోకి వస్తే, కృత్రిమత్వం మరింత బలిసిపోదా?

స్త్రీలు, సౌందర్య పోషణ

బూర్జువా సంస్కృతిగా దేనినైనా త్రోసిపుచ్చవచ్చు గాని, సౌందర్యపోషణకై స్త్రీలో సహజంగా వుండే ప్రబలాకాంక్షను త్రోసిపుచ్చలేమని సోవియట్ యూనియన్ నాయకులు గుర్తించవలసి వచ్చింది. అందువల్లనే క్రీమ్, పౌడర్, రూజ్, లిప్ స్టిక్ మొదలైన సౌందర్యపోషణద్రవ్యాలు వినియోగంపై బోల్షివిక్ విప్లవ ప్రారంభంలో తాము విధించిన నిషేధాలను వారు క్రమంగా సడలిస్తూపోయారు. చివరికి వారే ఇప్పుడు ఈ సౌందర్యపోషణ ద్రవ్యాల విషయమై ఒక ప్రత్యేక పరిశోధన కేంద్రాన్ని సంస్థాపించారు.

"ఇది మార్క్సిజం – లెనినిజం పట్ల మహాద్రోహం" అని చైనా కమ్యూనిస్టు పార్టీ మరొక గాలి దుమారాన్ని రేగగొట్ట వచ్చు. అయినా, అయినా, మరికొంత , అసలైన, సిసలైన "మార్క్మిజం.

లెనినిజం" ఎంభాలో తాను వచుస్తున్నట్టుగా గొప్పలు చెప్పుకుంటున్న చైనా కమ్యూనిస్టు పార్టీ చయితల స్త్రీల సౌందర్య పోషణేశుడు "బాసోహాలు" అనవలసి వస్తుంది.

సౌందర్యపోషణ వాంఛ స్త్రీజాతి స్వభావంలోనే ఒక ముఖ్య భాగం, జరునా గీరు ఆ ఎవో వంకర పేర్లు పెట్టి, దాన్ని అణచివేయుడం మానో తలదన్నిన డిక్టేటరుల క్రినా సాధ్యం

క్రీమ్, పౌడర్, రూజ్, లిప్ స్టిక్లు కాకపోతే పసుపు కుంకుమలు, అవీ కాకపోతే సురకటి, ఏదో ఒకదాన్ని తన సౌందర్య పోషణకు సాధనంగా చేసుకొనడానికి స్త్రీ సర్వకాలాలలో, సమస్త దేశాలలో ప్రయత్నిస్తుంది. వెండి, బంగారాలు లేనినాడు ఆమెకు గవ్వలు, పూసలు ఆభరణాలు కాలేదా? నాగరికత వికసించక ముందే నగా నట్రా పుట్టింది.

"లేని అందం తెచ్చి పెట్టుకుంటే వస్తుందా? అనేది స్త్రీ జాతికి అర్ధంకాని మాట కనుక, అది వ్యర్థపు మాటే.

వ్యాపార కళ

తమ 'స్వరాజ్య" పత్రిక తెప్పించుకొనగోరేవారు దాని సాలుసరి చందాను రూపాయలలోనే చెల్లించనక్కర లేదని, బియ్యం రూపంలోనైనా దాన్ని తీసుకోగలమని చెప్పి, ప్రకాశం పంతులుగారు ఈ విచిత్ర పద్ధతిని కొంతకాలంపాటు అమలు జరిపారు. ఇందుమూలంగా ఎందరు కొత్త చందాదారులను ఆయన సంపాదించగలిగారో ఆ వివరం మనకు తెలియదు.

కొంత మార్పుతో ఈ పద్ధతిని మోటారు కార్ల బేరానికి నోయెల్ రోస్కో జయప్రదంగానే అమలు జరుపుతున్నట్టు కనబడుతుంది. ఇతడు వోకింగ్ (ఇంగ్లండు)లో మొన్న ఒక కొత్త కారును అమ్మకం చేసి, దాని ఖరీదు కింద 420 పౌనులతో పాటు పన్నెండు గాడ్జెలను పుచ్చుకున్నాడు.

ఇతడికి గాడ్దెలపై ప్రత్యేకాభిమానం వున్నట్టు ఈ వార్తను బట్టి అనుకోనక్కరలేదు. కారు ఖరీదులో కొంత భాగం కింద గొర్రెలు, ఆవులు, గుర్రాలు, పాత నగలు, పాత ఫర్నిచర్ మొదలైన వాటిలో దేనినైనా తీసుకొనడానికి తనకు అభ్యంతరం లేదని ఇతడు చెబుతున్నాడు. ఒక్క పందుల విషయంలోనే ఇతడి అభ్యంతరం. వాటికి ఎక్కువ మేత కావాలట. తనను తిని వేస్తాయని ఇతడి భయం.

మతిలేని మనిషికింద రోస్కోను మనం జమకట్టనక్కరలేదు "లాభం లేని శెట్టి వరదను పోడు" ఏదో ఒక లాభం వుండబట్టే, ఈ కొత్త పద్ధతి కార్ల బేరాన్ని ఇతడు ప్రారంభించాడు. ధనరూపంలో మొన్నటి బేరంలో ఒకవేళ కొంత నష్టం వచ్చినా, ప్రచార రూపంలో చాలా పెద్ద లాభమే వచ్చింది. దేశ దేశాలలోని వేలాది పత్రికలలో పైసా ఖర్చు లేకుండా తన పేరును ప్రకటించుకో గలిగాడు.

మన చతుష్షష్టి కళలలో "సేల్స్ మన్ షిప్" చేరి వున్నదో, లేదో ఇప్పుడు మాకు జ్ఞాపకం లేదుగాని, అది నిజంగానే ఒక కళ. దానిలో ప్రావీణ్యం లేనివారు వ్యాపారంలో

రాణించనూ లేరు, కోటీశ్వరులు కానూలేరు. మన దేశానికి సంబంధించినంతవరకు ఇది సింధీలకు, గుజరాతీలకు వెన్నతో పెట్టిన విద్య.

వీధుల, వాడల పేర్లు

మచిలీపట్నానికి "బందరు" అనేది మరొక పేరు. మచిలీపట్నం పరిసర ప్రాంతాల వారు దాన్ని "పేట" అని కూడా (ఇప్పటిమాట తెలియదుగాని, నలభై, యాభై సంవత్సరాల క్రితం) పిలుస్తూ వుండేవారు. తమ పెక్కు వాడలను ఆ పట్టణవాసులు "పేటలు" గా పిలుచు కొనడమే ఇందుకు కారణమేమో.

ఏమైనా బందరు వాడల పేర్లలో దాని చరిత్ర కొంతవరకు దాగివున్నది. పదహారు, పదిహేడు శతాబ్దాలలో యూరోపియన్ దేశాలవారు వ్యాపారానికి బందరు రేవును ఎక్కువగా వాడుకునేవారు. వారిలో కొందరు అక్కడ తమ ఆఫీసులను, గిడ్డంగులను కట్టుకున్నారు.

ఒక్కొక్క యూరోపియన్ దేశంవారు ఒక్కొక్క వాడలో స్థిరపడ బట్టి కాబోలు, బందరులో ఒకటి ఫ్రెంచిపేట, మరొకటి వలందు పేట, వేరొకటి ఇంగ్లీషు పాలెం.

వెనకటి చరిత్ర ఈవిధంగా తమవాడల, పేర్లలో ప్రతిఫలిస్తుండగా, వర్తమాన చరిత్ర తమ వీధుల పేర్లలోకి ఎందుకు ఎక్కరాదన్న పట్టుదలతో కాబోలు, బందరు పౌరులు ఆమధ్య ఒక వీధికి ప్రెసిడెంట్ కెనెడి పేరు పెట్టారు; తిరిగి మొన్న మరొక దానికి దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి పేరు పెట్టారు.

వెంకటప్పయ్య పంతులుగారి ప్రజాహిత జీవితం ప్రారంభమైంది బందరులోనే. అందువల్ల ఆయన నివసించిన వీధికి ఇప్పుడున్న పేరును తొలగించి, ఆయన పేరును పెట్టడం సముచితం గానే వున్నది.

గుంటూరులో ఇప్పుడొక “పట్టాభిపురం” వున్నది. అక్కడ ఒక “దేశభక్త నగర్" కలదో, లేదో మాకు తెలియదు. అది లేకపోతే, వెంకటప్పయ్య పంతులుగారు "మాకంటె మీకు దగ్గరివారా?” అంటూ బందరువారిపై పోటీగా రేపో, మాపో గుంటూరు వారు ఒక వాడకే ఆయన పేరు పెట్టవచ్చు.

మిత్రులు

నిజమే, నిన్న తెనాలిలో నీలంవారు వివరించినట్టు మన మిత్రులను వేర్వేరు వర్గాల కింద విభజించవచ్చు. కాని, ఆయన చేసిన వర్గీకరణ సమగ్రమైంది కాదనే చెప్పాలి.

నీలంవారి దృష్టిలో కొందరు తాత్కాలిక మిత్రులు కాగా, మరికొందరు పదవిలో వున్నప్పుడు చుట్టుకునే మిత్రులు, వేరొక కొందరు కేవలం వేదికలపై తారసిల్లే మిత్రులు. పోతే మిగిలినవారు నిజాయితీగా నడుచుకుంటూ, నాయకునిపట్ల అచంచల విశ్వాసాన్ని ప్రదర్శించే మిత్రులు. వీరే నిజమైన మిత్రులని ఆయన విశ్వాసం.

నీలంవారు పేర్కొన్న ఈ నాలుగు వర్గాల మిత్రులలో ప్రథమ, ద్వితీయ వర్గాలవారి మధ్య ఆయన దృష్టికి ఏమి భేదం కానవచ్చిందో మాకు పాలుపోవడం లేదు. పదవిలో వున్నప్పుడు ఈగలవలె చుట్టూ మూగేవారు తాత్కాలిక మిత్రులే కారా? ఇదే విధంగా వేదికపై తారసిల్లే మిత్రులైనా తాత్కాలిక మిత్రులే కారా?

ఏమైనా నీలంవారు మిత్రకోటిని తాత్కాలిక మిత్రులని, స్థిరమైన మిత్రులని రెండు ప్రధాన వర్గాల కింద విడదీసినట్టు తోస్తున్నది. కోరితే ఇట్టి ప్రధాన విభాగాలను మరి కొన్నింటిని చేయవచ్చు. ఉదాహరణకు, కొందరు సంతోష సమయాలలో మిత్రులు కాగా, మరికొందరు ఆపత్కాలంలో మిత్రులు. కొందరు ముఖస్తుతి చేసే మిత్రులు కాగా, మరికొందరు అప్రియ సత్యాలను పలకడానికి వెనుదీయని మిత్రులు.

నీలంవారు ఎంతవరకు మాతో ఏకీభవిస్తారో తెలియదు గాని, అప్రియసత్యాలను పలకడానికి వెనుదీయని వారే నిజమైన మిత్రులు. వారి పలుకులు కొన్ని సందర్భాలలో కఠినమైనవే కావచ్చు. అయినా, సచ్చింతతో, సద్భావంతో, ప్రేమాదరాలతో ప్రేరితమయ్యే పలుకులవి. వెంటనే ఎంత బాధ కలిగించినా, నిలకడమీద అవి హితవాక్కులని తెలియకపోదు.

కృశ్చేవ్ నవ్వు

జర్మన్ జానపద గాథలలోని "పక్" మన శనైశ్చరుని పోలినవాడు. మధ్యయుగం నాటి బ్రిటిష్ "పక్" సాక్షాత్తు ఆ సైతానే.

కాగా, షేక్ స్పియర్ "మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్" లో సృష్టించిన "పక్" అల్లరివాడైనా, అపకారం చేయనివాడు. అతను ఆడగలడు, పాడగలడు, నవ్వగలడు, నవ్వించగలడు.

షేక్ స్పియర్ పాత్రతో పోల్చదగువాడు సోవియట్ మాజీ ప్రధాని కృశ్చేవ్, పదవీ భారంకింద కుంగిపోకుండా ఆయన ఎన్నెన్నో ఛలోక్తులు విసురుతూ ఉండేవాడు. ఇతరుల పైనేకాక, తనపైన తానే వాటిని విసురుకునేవాడు. ఎంత కోపం వచ్చినా, అంతలోనే ఫక్కున నవ్వుతూ ఉండేవాడు. ఆయన ఎక్కడ వుంటే అక్కడ కిలకిల నవ్వులు కెరటాలవలె లేస్తూ వుండేవి.

అట్టి కృశ్చేవ్ ప్రస్తుతం ఉదాసీనంగా కాన వస్తున్నాడట. మొన్న మాస్కోలో జరిగిన ఎన్నికలలో వోటు చేయడానికి ఆయన వచ్చినపుడు తనచుట్టూ మూగిన పత్రికా విలేకరులతో నవ్వుతూ మాట్లాడినా, ఆ నవ్వులో పూర్వపు జీవకళ, మాటలలో మునుపటి హాస్యం తళుకు లేవట.

కృశ్చేవ్ దెబ్బయి మూడేళ్ల వృద్ధుడైనా, కేవలం వృద్ధాప్యంవల్లనే ఈ మార్పు వచ్చి వుండక పోవచ్చు. తన పదవి పోవడం, అదిపోయిన విధం అయినను క్రుంగదీసి వుండవచ్చు.

సోవియట్ ప్రజల దృష్టిలో, ఆయన ప్రస్తుతపు ప్రతిపత్తి ఎట్టిదైనా, "పక్" వలె నవ్వుతూ, నవ్విస్తూ, తుళ్లుతూ, పేలుతూ వుండే చమత్కార ప్రియుడుగా కృశ్చేవ్ ప్రపంచ ప్రజల స్మృతిలో చిరకాలం నిలిచిపోతాడు.

చందమామ

"చందమామ రావె! జాబిల్లి రావె!" అంటూ చిన్నారి పొన్నారి పాపలు చిరకాలంగా తమ చిట్టిచేతులు జాచి పిలుస్తున్నా, ఆ చిలిపి చందమామ చెంతకు రానేలేదు. ఆ మామ కోసం చెక్కిళ్ళవెంట బొటబొట నీళ్ళు కార్చి కార్చి, కౌసల్యానందనుడు సయితం అద్దంలోని మామనీడతో చివరికి సంతృప్తి పడవలసి వచ్చింది.

పసివారు ముద్దుల మామగాను, రసికులు తారానాథుడుగాను, విరహిణులు నిర్దయ హృదయుడుగాను, కవులు సుధాకరుడుగాను రూపకల్పన చేసుకున్న చంద్రమండలం మన చెంతకు రాకపోతే మాత్రమేమి? దాని చెంతకు మనం త్వరలోనే వెళ్ళబోతున్నాము. "మహాపర్వతం మహమ్మదువద్దకు రాకపోతే, మహమ్మదు మహాపర్వతం వద్దకు వెడతాడు" అనే లోకోక్తి మరి త్వరలోనే నిజం కాబోతున్నది.

తీరా అక్కడికి వెళ్ళిన తర్వాత కిందికి దిగగలమా అనే సందేహం ఇంతవరకు పీడిస్తూ వచ్చింది. బూది కొట్టుకున్నట్లు అప్పుడప్పుడు కనపడే చంద్రవదనం నిజంగా బూది పోగులతో నిండి వున్నదని ఖగోళ శాస్త్రజ్ఞులు నమ్ముతూ వచ్చారు. ఉల్కాపతనం చంద్రవదనాన్ని నజ్జునజ్జు చేసినా, బూది పోగులు లేవని, కాలు పెట్టగానే వాటిలో కూరుకుపోగల ముప్పులేదని అమెరికా వారి సర్వేయర్ నౌక రుజువు చేసింది.

ఇంతకాలంగా బెట్టు చేస్తూ వచ్చిన చందమామ గుట్టుమట్టులు బట్టబయలు కావడానికి మరెంతో కాలం పట్టదు. "చిట్టి పాప రావె! పొట్టి పాప రావె!" అంటూ రేపటి నుంచి అతడే పాటలు ప్రారంభిస్తాడేమో కూడా.

నడక, నడత

నడక తీరును బట్టి నడత తీరు కూడా వుంటుందని చెప్పవచ్చునేమో. పెళ్ళి నడకలు నడిచేవారు తాపీగా తప్ప పనులు చేయగలరా? అంగలు, పంగలు వేస్తూ నడిచేవారు ఆలస్యాన్ని సహించగలరా? ఈదురోమంటూ నడిచేవారు హుషారుగా వుండగలరా? లేడికి లేచిందే పరుగుగా నడిచేవారు చూచి రమ్మంటే కాల్చిరారా?

ఒక గాంధీజీ, ఒక పండిట్ జవహర్ లాల్, ఒక స్వామి రామతీర్థ – ఇట్టి కొందరిని విడిచి పుచ్చితే, మనది పెళ్లి నడకల జాతి. "పరుగులెత్తి పాలు త్రాగటం కంటె, నిలబడి నీళ్లు త్రాగడం మేలు" అనేదాన్ని మన మొక జీవితసూత్రంగా చేసుకున్నాము. "నిలబడి నీళ్లు త్రాగ" బట్టే కావచ్చు, మన జాతి నీళ్లు కారే స్థితిలో పడిపోయింది.

పాలు కావాలంటే పరుగులెత్త వలసిందే. పరుగులు ఉరుకులు లేకుండానే యూరప్, అమెరికాలు పోయిన మూడు, నాలుగు శతాబ్దాలలో విశేషంగా పురోగమించాయా? ఆ మాటకు వస్తే, నరుని నాగరికతకే పరుగు మూల కాదా?

"హంసయానం", "గజగమనం", "మందయానం" – ఇది ఏనాడు మనకు ఉత్తమ స్త్రీ లక్షణమైందో ఆనాడే మన జాతీయ జీవితంలో మాంద్యం ప్రవేశించింది. ప్రస్తుతం మన దేశానికి నాయకత్వం వహిస్తున్న శ్రీమతి ఇందిరాగాంధిని "నేలకు అడుగు ఆన్చి నడువవమ్మా" అని వెనకనుంచి తల్లిదండ్రులు హెచ్చరించి వుండకపోబట్టే కాబోలు, ఆమె గాలిలో తేలిపోతున్నట్టుగా చకచక నడుస్తుంది. ఆమె సరసను నడవడానికి తాను పరుగులు పెట్టవలసి వచ్చినట్టు యు.పి. ముఖ్యమంత్రి శ్రీమతి సుచేతా కృపలానీ ఫిర్యాదు చేయడం అకారణంగా జరగలేదు.

దొంగలు: దొరలు

బొంకినా అతికేటట్టు బొంకాలి కాని, అతిగా బొంకరాదు. "బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయలంతేసి" అనే ధోరణిలో బొంకితే, ఇట్టే దొరికిపోతారు.

తాళఫల ప్రమాణంలో మిరియాలు వున్నాయంటే, విశ్వామిత్ర సృష్టిని చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇట్టి విజయాన్ని కూడా సాధించరేమో అని కొందరైనా నమ్మవచ్చు. కాని లక్ష పెట్టినా దొరకని మెర్సిడెజ్ బెస్ట్ మోటారు కారును దివేల రూపాయలకే "నా పలుకుబడితో మీ కిప్పించే పూచీ నాది" అని చెబితే ఎవరు నమ్ముతారు, ఎలా నమ్ముతారు?

కేంద్ర ప్రభుత్వంలో క్యాబినెట్ సెక్రటరీగా నటనచేస్తూ షహరాన్‌పూర్ కు సతీసమేతంగా వెళ్లిన గురుప్రసాద్ భట్నగర్ రెండు, మూడు రోజులపాటు పెద్ద వెలుగే వెలిగాడు. ఆ బస్తీలోని ఒక పెద్ద హోటల్ లో బస; తన ప్రాపకం కోసం వచ్చిపోయే వారి ఖర్చుతో విందులు, వినోదాలు; బహుశా వారి కార్లలోనే వెళ్లి, వారి ఖర్చుతోనే షాపింగ్ కూడా. ఈ విధంగా రెండు, మూడు రోజులపాటు గురుప్రసాద్ రాజభోగాలను అనుభవించాడు.

తన పాచిక తిరుగు లేకుండా పారుతున్నదని నాల్గవనాటికి ధైర్యం చిక్కబట్టి కాబోలు తన హోటల్ యజమాని వాకిటిలో పదివేలకే ఒక మెర్సిడెజ్ – బెన్జను తెల్లవారే సరికి రప్పిస్తానని అతడన్నాడు. ఆమాటతో అతడి పుట్టి మునిగింది. ఇప్పుడతడు జెయిల్ లో కూర్చుని కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నాడు.

గురుప్రసాద్ వలె దొరకిపోకుండా తమకేదో పదవి కలదని, పలుకుబడి కలదని, దాన్ని వినియోగించి ఏ పనినైనా సునాయాసంగా చేయించగలమని ప్రజలను

మోసగిస్తున్న వారు ఈనాడు దేశంలో కోకొల్లలుగా వున్నారు. మన జాతీయ జీవితంలో నైతికపు విలువలు పూర్తిగా పడిపోబట్టే ఇట్టివారి సంఖ్య ఇంతగా పెచ్చు పెరిగి పోయింది.

దొరకబట్టి గురుప్రసాద్ దొంగ అయినాడు గాని, లేకపోతే దొరగా చెల్లేవాడే. ఇట్టి " దొరలు" ఈనాడు ఊరూర కానరావటం మన దేశదౌర్భాగ్యమే.

కరణాలు

"కరణంతో కంటు (విరోధం) కాటికిపోయినా తప్ప" దని పెద్దలు హెచ్చరించారు. దీన్ని పెడచెవిని పెట్టి, కరణాలను రెచ్చగొట్టడం, తెలివితక్కువ ఆక లెక్కువ.

జమా ఖర్చులలో ఆరితేరినవారిని కరణాలకు బదులుగా ఇక నియమించాలని మైసూరు ప్రభుత్వం ఆలోచిస్తున్నదట. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగల సమర్థులు; తిమ్మిని బొమ్మిని, బొమ్మిని తిమ్మిని చేయగల ఘటికులు కరణాలకు తెలియని విద్యలున్నాయా? కావాలంటే వారు జమ లేకుండానే ఖర్చు చూపించగలరు; ఖర్చు చేసి కూడా జమ మిగల్చగలరు. ఈ ఛలోక్తి కేమిగాని, జమాఖర్చులలో కరణాలకున్న నేర్పువల్లనే తరతరాలుగా మన గ్రామ పరిపాలన కొనసాగుతూ వచ్చింది.

వంశపారం పర్యంగా వస్తున్న కరణాలను ఇప్పుడు తొలగించి, వారి పదవులను లోకానుభవం లేని కొత్తవారికి కట్టబెడితే, కాపుతో కూడా కలహం కొని తెచ్చుకొనడమే కావచ్చు. "కరణానికి, కాపుకే జత; ఉలికి, గూటానికే జత" అని మనకొక సామెత వున్నది. "కరణాలు, కాపులు ఏకమైతే, కాకులు కూడా ఎగర" వని మరొక సామెత వున్నది. ప్రభుత్వయంత్రాంగంలో ఏవో సంస్కరణలకై ఉబలాటపడుతున్నవారు "కరణం సాధు కాదు, కాకి తెలుపు కాదు" అనే లోకోక్తిని సయితం నెమరువేసుకొనడం మంచిది.

"ఊరు పైన ఊరు పడినా, కరణంపై కాసు పడదు" అనేవారు కరణాలే కావచ్చు. కాసు ముట్టనిదే కరణం వీసంపాటి పని కూడా చేయకపోవచ్చు. అయినా చిరకాలంగా గ్రామసేవ చేస్తున్న కరణాలను ఒక్కసారిగా తొలగించడానికి యత్నించక, జమాఖర్చులలో అవసరమైన శిక్షణ వారికిచ్చి, వీలైనంతవరకు వారి సేవలను వినియోగించుకొనడమే చిక్కులేని పని.

కీర్తి కండూతి

పచ్చను ఒకప్పుడు ముఖంమీద మాత్రమే పొడిపించుకునేవారు కాబోలు! లేకపోతే "పచ్చ" అనే మాటకు "శబ్దార్థ చంద్రిక'లో 'పసుపువన్నె, పసరు వన్నె, మరకతమణి" అనే అర్థాలతోపాటు "ముఖము మీద పొడిపించుకొనుటచేత నేర్పడెడు పసరు వన్నెరేఖ" అనే అర్థాన్ని నమోదు చేసివుండరు.

చేయి తగిలినా, చెమట పట్టినా, తిలకం చెరిగిపోవడం కద్దు. ఈ బెడద దేనికని చెరగని తిలకంగా ముఖంపై కొందరు పచ్చ పొడిపించుకొనడాన్ని ఇప్పటికీ అక్కడక్కడ మనం చెదురుగా చూస్తూనే వుంటాము.

ముఖం నుంచి చేతులకు, చేతులనుంచి కాళ్ళకు – ఈ విధంగా రాను రాను పచ్చ మొత్తం శరీరానికి ప్రాకింది. లతలు, పువ్వులు, ముగ్గులు, నామాక్షరాలు మొదలైన రూపాలెన్నింటినో అది ధరించింది.

ఇప్పుడు అనాగరిక చర్యగా పరిణమించినా, ఒకప్పుడు మాత్రం పచ్చ – మన దేశంలోనే కాక, అన్ని దేశాలలో – నాగరికతకు, నాజూకుతనానికి చిహ్నంగా వుండేది. పోటీపడి ఒకరికంటె మిన్నగా మరొకరు వొంటినిండా పచ్చలు పొడిపించుకొనేవారు.

ఈనాటికి కూడా నావికులకు సంబంధించినంతవరకు పచ్చ ఒక పెద్ద ఫ్యాషన్. రేవు రేవులోను ఒక పచ్చ పొడిపించుకొనడం వారికి పరిపాటి.

తక్కిన ఘనత లేవీ తనకు లేనందున కనీసం పచ్చల విషయంలో నైనా ఘనత దక్కించుకోవాలని కాబోలు, ఒక అమెరికన్ నావికుడు 4, 831 పచ్చలు పొడిపించుకొన్నాడట. ఇది ప్రపంచం మొత్తానికి "రికార్డు" కాబట్టే ఇతడి మరణవార్త టోరంటో నుంచి మనవరకు నిన్న వచ్చింది.

కీర్తికండూతి చాలా చెడ్డది కనుక, పత్రికలలోకి తమ పేరు ఒకసారైనా యెక్కడానికి మరొక రెవరైనా 4,832 పచ్చలను పొడిపించుకుంటే, మనం ఆశ్చర్యపడనక్కర లేదు. కాని, పచ్చలు తెచ్చే కీర్తి ఎంతకాలం కచ్చితంగా నిలుస్తుంది అనేదే ప్రశ్న.

కీడులో మేలు

ఇండో – చైనాలో "భూత" నామసంవత్సరం వెళ్ళి, "సర్ప" నామ సంవత్సరం ఈ మధ్యనే ప్రవేశించిందట. భూతం ఎంతగా పట్టి పీడించినా, సర్పంకంటె అది కొంత మెరుగట. పాలుపోసి పెంచేవాడినే కాటువేసే తుచ్ఛపు పనికి పామువలె భూతం పాల్పడదట.

ఇండో – చైనాలో "సంవత్సరాలకు ఈ పాడు పేర్లు పెట్టుకొనడమేమిటి? ఈ పేర్లను బట్టి కాలం నడుస్తుందని భావించడమేమిటి?" అని మనం విస్తుపోనక్కరలేదు.

మనమైనా విరోధి, వికృతి, ఖర, దుర్ముఖి, వికారి, క్రోధి, పరాభవ, రాక్షస, రౌద్రి, దుర్మతి, రుధిరోద్గారి, రక్తాక్షి మొదలైన పేర్లను మన సంవత్సరాలకు పెట్టుకోలేదా? ఇప్పుడు నడుస్తున్న విశ్వావసునామ సంవత్సరం త్వరలో ముగిసి, పరాభవనామ సంవత్సరం ప్రవేశించగానే మనకు ఎన్నో పరాభవాలు తప్పవని మన ఛాందసపు పండితులు అప్పుడే జ్యోతిషం చెప్పడం లేదా?

వైజ్ఞానిక రంగంలో పురోగమించినా, ఆధునిక రాజ్యంగా చెల్లుతున్నా, జపాలో కూడా ఇట్టి మూఢవిశ్వాసాలు లేకపోలేదు. వారి పంచాంగం ప్రకారం ఈ మధ్యనే వారికి “అగ్ని – అశ్వం' అనే సంవత్సరం ప్రవేశించింది. ఈ సంవత్సరంలో పుట్టిన ఆడపిల్లలు తమ భర్తలను నిలువునా చంపే ప్రమాదం వున్నదట. ఇందువల్ల ఈయేడు పుట్టే బాలికలకు వివాహాలు జరగడం చాలా కష్టమట. మౌఢ్యాలు ఎన్ని వెర్రితలలనైనా వేయగలవనడానికి ఇది మరొక గట్టి నిదర్శనం.

అయితే, ప్రతి కీడులో ఒక మేలు వున్నట్లు, ఈ మౌఢ్యం వల్ల కూడా జపాన్ కొంత లాభం పొందగలదేమో! ఆడపిల్లలు కలిగితే వారికి కల్యాణ ప్రాప్తి లేదన్న భయంతో జపాన్లో పెక్కుమంది ఈ సంవత్సరం అసలు బిడ్డలను కనకపోవచ్చునట.

పరాభవాలను ఎందుకు తెచ్చుకోవాలని వచ్చే సంవత్సరంలో మనదేశంలో ప్రతి ఒక్కరూ శాంతంగా, సౌమ్యంగా ప్రవర్తిస్తే, మన మూఢవిశ్వాసం వల్ల మనకు కూడా కొంత సత్ప్రయోజనమే కలుగుతుంది.

మత్తుకు విరుగుడు మందు

ప్రాచీనకాలపు గ్రీకుల ఛలోక్తి ప్రకారం పర్షియన్లు ప్రతి సమస్యను రెండేసి సార్లు చర్చించేవారు; మైకంలో వున్నప్పు డొకసారి, నిషా దిగిపోయిన తరువాత మరొకసారి. ఈ ఛలోక్తి పర్షియన్లకే కాదు, త్రాగుబోతులందరికీ వర్తిస్తుంది.

నిషాలోవున్న మనిషి దారి వేరు; అది దిగిపోయిన తరువాత మనిషి దారి వేరు. బుడ్డి తరుగుతున్న కొద్దీ బుద్ధికూడా తరిగిపోతుంది. మందుహుషారు పైకి తన్నుతుంది. ఎంత మితభాషికైనా నోటికి తాళం విడిపోతుంది. చెప్పిందే చెప్పడం ప్రారంభిస్తాడు. కైపెక్కిన కొద్దీ తల తిరుగుతుంది, కాళ్లు తేలిపోతాయి, మా తడబడుతుంది. అంతవరకు మనిషి మనసును నిగ్రహించిన సంకోచాలన్నీ పటాపంచలవుతాయి; నీతికి అవినీతికి, మంచికి చెడుకు భేదాలన్నీ మటుమాయ మవుతాయి. భౌతికంగా ఒక వస్తువు రెండేసి వస్తువులుగా

కనబడినా, నైతికంగా యుక్తాయుక్తాలు ఏకమైపోతాయి. తెలివిలో వున్నప్పుడు చేయలేని పనులను అప్పుడు నిరాఘాటంగా చేసివేస్తాడు, క్రమంగా నిర్వికల్పసమాధిలో ప్రవేశిస్తాడు.

త్రాగుడు పరిమితంగా వున్నంతకాలం ఆరోగ్యానికి భంగం జరగదు. మితిమీరినప్పుడే అది శారీరక, మానసికారోగ్యాలను చెడగొడుతుంది. శరత్ బాబు "దేవదాసు" వలె తమపై తమకు జాలితో, కష్టాలను మరచిపోవడానికన్న వంకతో, సంఘ మర్యాదల సాకుతో, ఇంకా రకరకాలుగా పెక్కుమంది మద్యపానానికి అలవాటు పడతారు. ఈ వ్యసనాన్ని వదిలించుకోవా లనుకున్న కొద్దీ దాని ఉచ్చులో బిగిసిపోతారు.

బహుశా అటువంటివారి కోసమే కావచ్చు, పశ్చిమజర్మన్ శాస్త్రవేత్తలు "ఎక్స్" అనే మందు కనిపెట్టారట. అది నిషాకు విరుగుడుగా పనిచేస్తుందట. అయితే, మితంగా పుచ్చుకునేవారికి విరుగుడు అక్కరలేదు. అమితంగా త్రాగేవారు నిషాకోసమే వెంపరలాడుతారు కనుక, విరుగుడు వారు పుచ్చుకుంటారా?

దొరికిన సొమ్ము

తోటి పిల్లవాడు ఏ గోలీకాయనో, బొంయిరాన్నో, మరొక వస్తువునో పోగొట్టుకోగా అది దొరికిన పిల్లవాడు దాన్ని తిరిగి ఇవ్వడు. పైగా, ఎందుకు తిరిగి యివ్వాలని తగవుచేస్తాడు. తప్పుచేస్తున్నా, దాన్ని సమర్థించుకొనడానికి మానవ ప్రవృత్తి ఏదో ఒక ధర్మసూత్రాన్ని కనిపెట్టడానికి ప్రయత్నం చేస్తుంది. ఈ సందర్భానికి అది కనిపెట్టిన ధర్మసూత్రం "దొరికిన సొమ్ము దొంగలకిస్తారా?" అనేది.

ఇక్కడ "దొంగ" లెవరైనా ఉంటే, తమకు చెందని సొమ్మును తమది చేసుకొనడానికి ప్రయత్నిస్తున్నవారే. అయినా, అసలు సొమ్ము ఆసామిని వారు "దొంగ" కింద జమకడతారు. ఈ వైపరీత్య సమర్ధనకు అదృష్టదేవతను సృష్టిస్తారు కూడా. ఆ దేవత స్వయంగా తమకిచ్చిన సొమ్మును దాని సొంతదారులైనా తిరిగి కోరితే, వారు నిశ్చయంగానే "దొంగలు".

ఏమైనా, సంపాదించిన సొమ్ముకంటె దొరికిన సొమ్ము ఎక్కువ తీపిగా వుంటుంది. అందువల్లనే కావచ్చు, దాన్ని తిరిగి యివ్వడమంటే నూటికి తొంభై మందికి మనసొప్పదు.

ఈ విధమైన మనోదౌర్బల్యానికి లోనుగాకుండా తనకు దొరికిన వజ్రపుటుంగరాన్ని స్వచ్ఛందంగా, సంతోషంగా తిరిగి యిచ్చినందునే బ్రిటన్‌కు చెందిన మిసెస్ ల్యాంబ్ నిన్న వార్త కెక్కింది. ఆ ఉంగరాన్ని 33 సంవత్సరాలనాడు మిసెస్ సమ్మర్స్ తమ పొలంలో పోగొట్టుకున్నది. ఆ పొలాన్ని కొన్న మిసెస్ ల్యాంబ్ కు పదకొండు సంవత్సరాలనాడు అది దొరికింది. ఈ మధ్య వారిద్దరు కలుసుకున్నప్పుడు పోయిన తన ఉంగరం ప్రసక్తిని మిసెస్ సమ్మర్స్ తీసుకురాగా, "అది నాకు దొరికింది" అంటూ మిసెస్ ల్యాంబ్ దాన్ని యిచ్చివేసింది.

ఆమెది "గట్టి సొమ్ము" కాబట్టే మిసెస్ సమ్మర్స్ వజ్రపుటుంగరం 33 సంవత్సరాల తర్వాత ఆమెకు తిరిగి దక్కినట్టు మనం అనుకోనక్కరలేదు. మిసెస్ ల్యాంబ్ దొడ్డబుద్ధిగల యిల్లాలు కాబట్టే, ఈ పని జరిగింది.

దొంగలలో దేశభక్తి

దేశభక్తులలో దొంగలున్నప్పుడు దొంగలలో దేశభక్తులుండడం అబ్బురం కానక్కరలేదు. తమలోనైనా దేశభక్తి పూజ్యం కాదని పోయిన మూడు నెలలో మన దేశంలోని దొంగలు రుజువు చేశారు.

భారత ప్రభుత్వం హోం శాఖవారు వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించిన భోగట్టా ప్రకారం పాకిస్తాన్ మనతో యుద్ధానికి తలపడిన తర్వాత (1965లో) దేశంలో నేరాల సంఖ్య నూటికి 40 వంతుల వరకు తగ్గిపోయింది. దేవం మొత్తంమీద కాక, యుద్ధం కొనసాగిన సరిహద్దు ప్రాంతాలలో మాత్రమే పోయిన మూడు నెలల నేరాల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే, అవి నూటికి 80 వంతులమేరకు తగ్గిపోయినట్టు కనబడవచ్చునేమో కూడా.

నేరాల తగ్గుదలకు హోంగార్డ్ దళాలకు చెందినవారేమి మాజీ సైనిక వర్గాలకు చెందినవారేమి 70,000 మంది రాత్రింబవళ్ళు ప్రస్తుతం గస్తీ తిరుగుతూ వుండడం ఒక కారణం కావచ్చునని ఛోం శాఖవారు ఒక సూచన చేస్తున్నారనుకోండి. ఇటీవల మన జాతి ఎదుర్కొన్న ఘోరప్రమాదం ప్రతి పౌరుని మనస్తత్వంలో తెచ్చిన విప్లవాత్మక పరివర్తనపట్ల కొంత శంక ఈ సూచనలో గర్భితమై వున్నది. అందువల్ల పరిపాటిగా నేరాలు చేస్తుండేవారు "అఖిల భారత నేరస్థుల మహాసభ" అనే దాన్ని జరిపి, "మా దేశభక్తిని శ్రీ నందా, ఆయన మంత్రిత్వశాఖవారు శంకించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాము" అని ఒక తీర్మానాన్ని చేసినా చేయవచ్చు.

ఛలోక్తుల కేమిగాని, మొన్నటి అగ్నిపరీక్ష మొత్తం భారత జాతినే అనేక విధాల పునీతం చేసింది. ఇది తాత్కాలిక పరివర్తన కారాదు. ఇంతే జరిగితే, ఇకముందు రాగల మరింత తీవ్రమైన అగ్నిపరీక్షలకు మనం నిలవలేము; మన దేశస్వాతంత్ర్యాన్ని, సమగ్రతను కాపాడుకోలేము.